

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
డిసెంబర్ 13, 2015

కాలుష్య ప్ర'తాపం'

మాధురీ దీక్షిత్

...శ్రీదేవికి అప్పుడు పదమూడేళ్లే!

సినిమాలు, సినీ స్టార్ల గురించి తెలుసుకోవాలని అభిమానగణం తెగ ఉత్సాహపడుతుంటుంది. అయితే అన్ని విషయాలూ జరిగిన వెంటనే తెలియవు. చాలా కాలం తర్వాత పత్రికల్లోనో, న్యూస్ చానళ్లలోనో బయటికి వచ్చినప్పుడు ఆశ్చర్యపోతుంటారు. అలాంటి ఆసక్తికరమైన విశేషాలు కొన్ని...

- ఇవాళ సినీ స్టార్లు అందుకుంటున్న పారితోషికం గురించి తెలిస్తే కళ్లు తిరిగిపోతాయి. కోట్లల్లో వుంటుంది మరి. కానీ... అలనాటి కథానాయకుడు ధర్మేంద్ర మొదటిసారిగా అందుకున్న పైకం ఎంతో తెల్సా! 51 రూపాయలు!
- 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో అనిల్ కపూర్ పాత్రకు మొదట షారూక్ ఖాన్‌ను అనుకున్నారు!
- ఇప్పుడంటే అనిల్ కపూర్ విజయవంతమైన నటుడే. అయితే ముంబై చిత్రసీమకు వచ్చిన తొలిరోజుల్లో రాజ్ కపూర్ గ్యారేజీలో బస చేశాడు.
- 1964లో విడుదలైన 'యాదేం' చిత్రం ఆద్యంతం సునీల్ దత్ ఒక్కడే కనిపిస్తాడు. ఏక నటుడితో నడిచిన 113 నిమిషాల నిడివిగల చిత్రంగా గిన్నిస్ రికార్డుల్లో స్థానం సంపాదించుకుంది.
- 'దిల్ చాహ్తా హై'లో అక్షయ్ ఖన్నా నటన ఎంతగానో గుర్తింపు పొందింది. నిజానికి ఆ పాత్రకు షైనీ అహుజాను అనుకున్నారు.
- 92 అవార్డులు సొంతం చేసుకున్న చిత్రంగా 'కహో నా ప్యార్ హై' చిత్రం గిన్నిస్ రికార్డులకెక్కింది.
- 'బజరంగీ భాయ్ జాన్' తర్వాత సల్మాన్ ఖాన్ రెండు గుర్రాలను కొని వాటికి బజరంగీ, భాయ్ జాన్ పేర్లు పెట్టాడు.
- జితేంద్ర తొలి చిత్రం 'నవరంగ్'. అదీ... నటి సంధ్యకు డూప్‌గా.
- 'మైనే ప్యార్ కియా'లో ప్రేమ్ పాత్రకు విదూ దారా సింగ్, పీయూష్ మిశ్రాను అనుకున్నారు. చిట్ట చివరికి ఆ పాత్ర సల్మాన్‌ఖాన్‌ని వరించింది.
- 'లూటేరా'లో ఒక సన్నివేశానికి తగిన భావాలను పలికించేందుకు రణవీర్ సింగ్ చాలాసార్లు పిన్నీస్‌తో గుచ్చుకున్నాడట.
- 'ఎల్.ఒ.సి కార్గిల్, మేరా నామ్ జోకర్' నిడివి ఎక్కువ కలిగిన బాలీవుడ్ చిత్రాలుగా బాలీవుడ్ చరిత్రలో నిలిచిపోయాయి. మరి 4 గంటల 25 నిముషాల సినిమాలంటే మాటలా!
- 'దిల్ తో పాగల్ హై'లో మాధురీ దీక్షిత్‌ను అందంగా చూపించేందుకు డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించిన 54 డ్రస్సులను యష్ చోప్రా తిరస్కరించాడట. చివరికి తెలుపు, పసుపు, లేత కాషాయ రంగుల్లో అందంగా మలిచిన సల్వార్ కమీజ్‌ను ఓకే చేశాడు.
- తమిళ చిత్రం 'మూండ్రు ముడిచు'లో రజనీకాంత్ సవతి తల్లిగా నటించిన శ్రీదేవికి అప్పుడు పదమూడేళ్లే.
- ఉత్తమ నటులుగా అత్యధిక ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకుని దిలీప్ కుమార్, షారూక్ ఖాన్ రికార్డు సృష్టించారు.

◆

రజనీ, శ్రీదేవి


జితేంద్ర, సంధ్య



సునీల్‌దత్


అనిల్ కపూర్,రాజ్ కపూర్

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కల్తీ కానిదేది!

కల్తీ ...కల్తీ ...కల్తీ..! కాదేదీ కల్తీకి అనర్హం అంటున్నారు కేటుబాబులు. నిజం చెప్పాలంటే నేడు కల్తీ దందా రాజ్యమేలుతోంది. మనం తినేదీ ... తాగేదీ... ఇదీ అదీ అనేముంది. ప్రతిదీ కల్తీమయమే. కాకపోతే మనం కల్తీవే తింటున్నామని...తాగుతున్నామని తెలీనంత అమాయకత్వంలో పడి కొట్టుకుపోతున్నాం.

పాత రోజుల్లో పాలల్లో నీళ్లు కలిపితే 'అయ్యో... కల్తీ జరిగిందే' అని బాధపడేవారం. ఆ తర్వాతి కాలంలో మామిడిపండ్లను కార్బయిడ్లతో పండిస్తున్నారని తెలిసి లబలబలాడిపోయాం. అలాంటిది ఇవాళ రసాయనాలతో, ఇంజక్షన్లతో రాత్రికి రాత్రి సపోటా, అరటి, ఆపిల్, ఆరంజ్, పుచ్చకాయలను పండబెట్టేస్తున్నారు. జంతు కళేబరాలతో వంట నూనెలు చేసేస్తున్నారు. యూరియాతో పాలు... హానికర పదార్థాలతో నెయ్యి...సుగంధ ద్రవ్యాలు, పప్పులు, ఉప్పులు తయారు చేస్తున్నారు. దాంతో మార్కెట్లో ఏది చూసినా... తాజాగా నవనవలాడుతూ, ఆకర్షణీయమైన రంగుల్లో 'రా రమ్మని...కొనమని' ఊరిస్తుంటాయి. అయితే...ఆ తాజాదనం వెనక వున్నది... మైనపు పూతలు, తైలాల పిచికారీ అని తెలిస్తే మాత్రం దంగైపోతాం.

ఆశ మనిషిని కల్తీ చేసింది. ధనం మనసునూ కల్తీ చేసింది. అత్యాశ అన్నిటినీ కల్తీ చేసింది. ఇప్పుడు రోడ్డు పక్క షాపుల్లోనే కాదు. పేరొందిన రెస్టారెంట్లలోనూ ... బ్రాండెడ్‌గా భావించే వస్తువుల్లోనూ... కల్తీ ఆహారం తప్పడంలేదు. బజార్లో దొరికేవి ఏవి అసలైనవో...ఏవి నకిలీవో తెలుసుకోవడం కష్టంగా తయారైంది. కనబడేదంతా నిజం కాదు. మెరిసేవన్నీ తాజావి కావు. పైపై మెరుగులు... ఆకట్టుకునే రంగులు... వంటినే కాదు. ఇంటినీ గుల్ల చేస్తున్నాయి. కల్తీ పళ్లనే తాజావనుకొని బోలెడంత ధర పెట్టి మరీ కొనుక్కెళ్లి... రోగాలు తెచ్చుకొంటున్నాం. కిక్కు కోసం కల్తీ సారా సీసాలకొద్దీ తాగేసి ప్రాణాల మీదకు తెచ్చుకుని కుటుంబాలకు కుటుంబాలను వీధుల పాల్జేస్తున్నాం.

ఇంత వినాశనానికి కారణమైన కల్తీని కట్టడి చేయలేమా! అంటే అందుకు కావాల్సినవన్నీ వున్నాయి. తూనికలు-కొలతలు, పౌర సరఫరాలు, కల్తీ నిరోధక శాఖ, విజిలెన్స్, పోలీసు, వాణిజ్య పన్నుల శాఖ... చాలా విభాగాలే వున్నాయి. ఏం లాభం? నామక: కేసులు పెట్టడం మినహా అక్రమ వ్యాపారాలకు చెక్ పెట్టే సూచనలే లేవు!

అయినా...కల్తీ జరుగుతోంది కేవలం తినే తాగే వాటిల్లోనే అనుకుంటే పొరపాటే. రాజకీయాలూ కల్తీ బాట పట్టాయి. పూర్వం రాజకీయాల్లోకి సేవ చేయడానికి వచ్చేవారు. ఇవాళ కల్తీనేతలు పెరిగిపోయారు.కోటలు, కోట్లు కూడగట్టుకోవడమే వీరి లక్ష్యం. అందుకోసం తమ మాటకారితనంతో... ఓటర్లనే కాదు. యావత్ ప్రజానీకాన్ని మోసం చేసేస్తున్నారు.

వినియోగదారులుగా, ఓటర్లుగా ప్రశ్నించి నిలేయ గలిగినప్పుడే కల్తీల నుంచి ఒకింతైనా బైటపడగలం.

■

◆ మనలో మాట



టపా

ఉత్తరం ఎంత గొప్పదో

భారతీయులు ఎన్ని కష్టాలనైనా భరిస్తారు. ఎంత ఇరుకులోనైనా సర్దుకుంటారు. స్త్రీలు ఒక నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటారు. అందుకు ఉదాహరణే ఈ ఎదురు లేని బౌన్సర్లు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా ఉత్తరానికి ఉన్న గొప్పతనం ఎప్పటికి తగ్గదు. తిండి లేక చాలా మంది ప్రజలు విలవిల్లాడుతున్నారు. వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవడం మంచి పని. రైతు లోక బాంధవుడు కవిత చాలా బాగుంది. యుగ కవి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. గురజాడ వారి వర్ధంతి సందర్భంగా చాలా విషయాలు తెలుసుకున్నాం.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, పూజారిపేట, శ్రీకాకుళం

దార్శని నాయకుడు

యుగకవి 100వ వర్ధంతి వ్యాసం చదివాను. ప్రస్తుతం మన సమాజంలో కన్యాశుల్కం లేదు. కానీ అది ఇంకా ప్రజల హృదయాల్లో నిలిచివుందంటే ఈ సమాజపు వాస్తవ వికృత రూపాలు ఇప్పటికీ ప్రతిఫలిస్తుండడమే. కన్యాశుల్కంలోనే కాదు మహాకవి అన్ని రచనలలోనూ, పతనమైపోతున్న ఈ సమాజాన్ని ఆవేదనతో అక్షరాలా లిఖించాడు రచయిత. గురజాడ ఎప్పుడూ దార్శనికుడే!

రాఘవేంద్ర శ్రీనివాస్, మచిలీపట్నం (మెయిల్)

అన్నీ బాగున్నాయి

గమనం కథ చాలా బాగుంది. చదివిన చదువుకు సరైన ఉద్యోగం రాకపోతే ఆ చదువుతోనే తనకు నచ్చిన పని చేసుకుంటూ పోయే ఒక మధ్య తరగతి కుటుంబ జీవనం గురించి రచయిత చాలా చక్కగా వివరించారు. మన దేశంలో మూడోవంతు మందికి తినడానికి తిండి లేక నానా కష్టాలు పడుతుంటారు. అభివృద్ధి చెందిన దేశాలల్లో చాలా వరకు వృధాగా పడేస్తుంటారు. ఈ విష సంస్కృతికి చరమగీతం పాడటానికి ఎంత మిగిలిపోతుందో అంత మొత్తానికి ఫైన్ వసూలు చేయడం బాగుంది. ఈ విషయాన్ని చాలా చక్కగా వివరించారు.

నాగార్జున, వెదురూర్, చాపాడు, కడప

రక్షణే కాదు ఆదాయం కూడా..

బౌన్సర్లు అనగానే భారీ దేహాలతో, నల్లటి దుస్తుల్లో అగుపించే వ్యక్తులు గుర్తుకు వస్తారు. అదే మహిళా బౌన్సర్లు అనగానే నవ్వుకుంటారు. యువత తప్ప తాగి పడిపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అందుకోసం బార్లలో లేడీ బౌన్సర్లను నియమిస్తున్నారు. మహిళలకు రక్షణే పరమావధిగా పని చేస్తున్నారు వీరు. ఇటు ఆదాయం అటు రక్షణ!! వింటేజీ కార్లు ఆకట్టుకున్నాయి. మరుగున పడిపోతున్న కారులను ఒక చోటికి చేర్చి వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడం నిజంగా ఆశ్చర్యంగా ఉంది.

సుధాకర్, వేముల, రాజమండ్రి

పసందైన సూప్

యుగకవి గురించి రాజగోపాల్ రాసిన వ్యాసం బాగుంది. గమనం కథ చక్కగా చదివించింది. ఈ వారం రుచి బాగుంది. ఒక పక్క చలిగాలి, మరో పక్క వేడి వేడి సూప్ లాగిస్తుంటే చాలా బాగుంది. వర్షాకాలంలో మంచి సూప్ గురించి వివరించారు.

రమణ, వైజాగ్ (మెయిల్)

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

కాలుష్య ప్ర'తాపం'

కవర్ స్టోరీ ——— 6

వంటకు మంట కావాలి.
అలా అని ఏకధాటిగా అధిక సెగ కొనసాగిస్తే ...?
మొక్కకు నీరు కావాలి.
అందుకని నీటితోనే కుండీని నింపేస్తే ...?
సేద తీరటానికి చల్లని గాలి కావాలి.
సరేలే అని మంచుకొండల మధ్య పవళించమంటే ....??
అమ్మో ... !! అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. గిన్నెతో సహా అన్నం మాడిపోతుంది. చివురు తొడగదు సరి కదా, మొక్క చచ్చిపోతుంది. విశ్రాంతి కాదు కదా, విపరీత చలికి శరీరం గజగజలాడిపోతుంది! ఇప్పుడు ఇలాగే ఉంది మన భూగోళం పరిస్థితి! అంతా అల్లకల్లోలం.

స్ఫూర్తి 3
మహా గట్టి మామ్

విశేషం 4
సైగల సరిగమలు...

కార్టూన్ పంచ్ 5

చూద్దామా 10
చోర్ బజార్

సినిమా కబుర్లు 14
నవ్వుల రాజు

వింత లోకం 16
ఓ తాత.. 34 ఏళ్ల కవర్

కవిత్వమ్ 17
చెట్టుకో తిట్టు

కథ 18
వ్యవహారం

రుచి 21
సగ్గుబియ్యం తాలిపేట్

బాల నేస్తాలు 22
విమానాల అన్నయ్య

ప్రత్యేకం 24
రాజు- పేద ఒక్కరే !

సందర్భం -12
మానవత్వమే వారి మతం

మహా గట్టి మామ్

నలభై ఏళ్లు. నలుగురు పిల్లల తల్లి. ఫైర్‌ఫైటర్‌గా ఒత్తిడితో కూడిన ఉద్యోగం. పొద్దునే స్కూళ్లకు పంపే పనీ పెద్ద ఫైటే. అయినా వీలు చిక్కించుకుని మరీ లోర్నా బిగ్గమ్ బాడీ బిల్డింగ్‌పై మహా పట్టుదలకు పోయింది. మిస్ స్కాట్లాండ్ ట్రెండ్ ఫిగర్‌ను కైవసం చేసుకుంది. కండలు తిరిగిన తన దేహంతో రోజురోజుకూ ప్రేమలో పడిపోతోన్న ఈ సూపర్ మామ్ కసరత్తుల్లో మహా గట్టే.

స్ఫూర్తి

లోర్నా బిగ్గమ్

స్కాట్లాండ్‌లోని హమిల్టన్‌కు చెందిన లోర్నాకు అప్పటికే ముగ్గురు పిల్లలున్నారు. మరో బుజ్జిగాడు బొజ్జలో ఉన్నాడు. అయినా వెయిట్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్‌లు ఆపలేదు. నిండు గర్భిణిగా ఉన్నప్పుడు 100 కేజీల బరువును అమాంతం ఎత్తేస్తూ కసరత్తు చేసేది. కాన్పు తేలికగా ఏమి జరగలేదు. సిజేరియన్ చేసి బిడ్డను తీశారు. నువ్వు ఇప్పట్లో బరువులెత్తకూడదని వైద్యులు తెగేసి చెప్పారు. బిడ్డ పెరిగే సమయంలో ఆమె పొట్ట కండరాలు సాగకపోవడం వల్ల 7 అంగుళాల చిరుగు ఏర్పడి లోపల గాయమైంది. 'సరే.. సరే..' అని చెప్పి ఇంటికి వచ్చిన లోర్నా 6 నెలలు పక్కన పెట్టండి.. 6 వారాల్లోనే జిమ్‌కు రెడీ అయిపోయింది. అప్పటి నుంచి విపరీతంగా కసరత్తులు మొదలెట్టేసి 10 నెలలు గడిచేసరికి బాడీబిల్డింగ్ టైటిల్ సొంతం చేసేసుకుంది. అదీ ఆమె పట్టుదల. ఇంత అతి అవసరమా అంటే నా శరీరం గురించి నాకు బాగా తెలుసు అని తేల్చిగ్గా సమాధానమిస్తుంది. ఇంతగా లోర్నా బాడీబిల్డింగ్‌పై ప్రేమలో పడిపోవడం అనుకోకుండానే జరిగింది.

అనుకోకుండా ....

14 ఏళ్ల ఫైర్ ఫైటింగ్ (అగ్నిమాపక శాఖ) సర్వీస్‌లో ఎన్నో ప్రమాదాలు కాచుకున్న లోర్నా మొదటి నుంచి బలిష్టురాలే. ఆ వృత్తికి సరిపడినంతగా ఉండేది. అయితే 2013లో ఓ ఫుట్‌బాల్ చారిటీ మ్యాచ్ సందర్భంగా గాయపడింది. ఆమె మోకాలు దెబ్బతినడంతో ఆ వృత్తిలో కొనసాగడానికి ఇబ్బంది ఎదురైంది. మోకాలు దృఢపరుచుకోవడానికి జిమ్‌కు వెళ్లేది. అలా వెళ్లడం వల్ల రోజురోజుకూ తన శరీరంలో మంచి మార్పు రావడాన్ని గమనించింది. మహిళా బాడీ బిల్డర్ల గురించి తెలుసుకునేది. క్రమంగా మామూలు వర్కౌట్ల నుంచి భారీ కసరత్తులు ప్రారంభించింది. రోజుకు ఆరు సార్లు బలవర్ధకమైన పోషకాహారం తీసుకునేది. ప్రతి మీల్‌లోను 6 ఎగ్ వైట్స్, స్టీక్, చికెన్ కచ్చితంగా ఉండాల్సిందే. వీటిని చేసి పెట్టడానికి ప్రత్యేకంగా ఎవరూ లేరు. ఆమె తయారు చేసుకోవాల్సిందే. ముగ్గురు పిల్లల్ని స్కూళ్లకు సిద్ధం చేయడం, దగ్గరుండి పంపించడం, వారికి వండి పెట్టడం, పాత్రలు శుభ్రం చేసుకోవడం అన్నీ ఒంటి చేత్తో చేసేస్తుంది. ఇక చంటోడి బాధ్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఫైర్‌ఫైటర్ జీవితం అదీ హమిల్టన్‌లో రాత్రుళ్లు, పగళ్లంటూ ఏమి ఉండదు. ఎప్పుడు కబురు అందితే అప్పుడు పరుగు పెట్టాల్సిందే.

అంతర్జాతీయ పతకంపైనే గురి

ఇంత బిజీ షెడ్యూల్, తీరు లేని పనివేళలు ఉన్నా ఆమె మాత్రం జిమ్‌కు ఒక్క రోజు కూడా గైర్హాజరైంది లేదు. నిద్రకు ఎంత ఆలస్యమవని ఉదయం 5:30 కల్లా లేగిన జుట్టుతోనే, మూతలు పడుతున్న కళ్లతోనే జిమ్‌కు వెళ్లిపోతుంది. చుట్టుపక్కల వారు పిచ్చిదానిలా చూస్తారు. జిమ్‌లో డంబెల్స్ శబ్దం వినబడగానే మత్తు అంతా వదిలిపోయి ఉత్సాహంగా రాడ్‌ను అందుకుంటుంది. అంత నిబద్ధత వల్లే ఆమె బైసెప్స్ 14 అంగుళాలకు, థైస్ 23.5 అంగుళాలకు చేరుకుని మంచి లుక్ తీసుకువచ్చాయి. కొలతల్ని పెంచుకుంటూ ఏ కాంపిటీషన్‌కా కాంపిటీషన్‌కు మార్పు ప్రస్ఫుటంగా కనిపించేలా మెరుగవుతోంది. ఆమె సహచరి అయిన స్టీవెన్ కూడా బాడీ బిల్డింగ్ ద్వారానే పరిచయమయ్యాడు. ఆస్‌బెస్టాస్ తొలిగించే కార్మికుడైన స్టీవెన్‌కు కూడా బాడీబిల్డింగ్ అంటే మహా శ్రద్ధ. పరిచయం కాస్తా ప్రేమగా మారి ఇప్పుడు లోర్నాకు అండగా మారాడు. ఆమెకు జిమ్ పాఠాలు నేర్పుతూ ఇంట్లోను బాధ్యతలు పంచుకుంటూ కాస్త సాయమయ్యాడు. ఇప్పుడు లోర్నా టార్గెట్ అంతర్జాతీయ టైటిల్‌ను సాధించడం. ఆమె పట్టుదల మహా గట్టిదని చెప్పాం కదా సాధించడంలో డౌటే లేదు. ✦

స్టీవెన్‌తో జిమ్‌లో...

లోర్నా కుటుంబం

సంభాషణకు భాష అడ్డం కాదు. అది చిన్నారుల మాటకు అర్థాన్నిస్తుంది. ప్రేమికుల తలపులకు సంకేతమవుతుంది. మూగబోయిన గొంతుక మాటకు బాట వేస్తుంది. భావోద్వేగాలకు బలాన్నిస్తుంది. అదే సైగల భాష. మనసుతో సాగే మౌన సంభాషణ. మూగ, బధిరులకు ఇదే బాసట అవుతుంది. సైగలతో మాట్లాడే వాళ్లను చూసి నవ్వే చిన్న మనుషులు ఉంటారు. అర్థం కాక తికమక పడే పెద్ద మనుషులు ఉంటారు. కానీ బాలిలోని బెంగ్కాలా గ్రామం అలా కాదు. దానిలో ఉండే మూడు వేల మంది గ్రామస్తులందరికీ ఈ సైగల భాష (కాటా కోలోక్) వచ్చు. పైపెచ్చు మూగ, బధిరులను చాలా గౌరవంగా చూసుకుంటారు. ఈ సైగల సరిగమల్ని చూసేందుకే సందర్శకులు వెళుతుంటారు.

సైగల సరిగమలు

జాంగర్ కోలోక్ అనే నిశ్శబ్ద నాట్యం గురించి బహుశా విని ఉండరు. బాలిలోనే కాదు ఇండొనేషియా అంతటా ప్రత్యేకంగా చూసే ఈ అరుదైన నృత్య శైలి బెంగ్కాలాలోనే పుట్టింది. బధిరుల నృత్యమనే అర్థాన్నిచ్చే ఈ నాట్యం ఎంతో వర్ణనాత్మకంగా ఉండటంతో పాటు ఆద్యంతం రక్తి కట్టించే సన్నివేశాలు అనేకం ఉంటాయి. భావోద్వేగాలను పలికే తీరును చూసి మాట పెగలదు. ఓ చిత్రం వంద మాటలను చెబుతుందంటారే అలా ఈ నృత్యం వందల భావాల్ని పలికిస్తుంది. బెంగ్కాలా అంటే బాలినీస్‌లో దాగే చోటు అని అర్థం. పేరుకు తగ్గట్టు ఈ గ్రామం కూడా బాలికి ఉత్తర కోస్తాలో ప్రకృతిలో దాక్కుని ఉంటుంది. ఎక్కడో మారుమూలగా ఉండే ఈ ప్రాంతంలో పర్యాటకుల తాకిడి కనిపిస్తూనే ఉంటుంది. దానికి కారణం ఆ నిశ్శబ్ద నృత్యం అనుకుంటే అది సగమే నిజం. అసలు కారణం ఇక్కడి ప్రజల మాటలను ప్రత్యక్షంగా చూడాలని. అదే సైగల భాషను స్పష్టంగా అర్థం చేసుకోవాలని. మొత్తం గ్రామస్తుల్లో కొద్ది మంది మాత్రమే కోలోక్‌లు (మూగ, చెవిటి వారు). తక్కువే అయినా మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే 15 రెట్లు అధికం వారి సంఖ్య. గ్రామంలో మిగతా వారికి ఈ సమస్య లేదు. కానీ ఇక్కడ పిల్లలు కూడా చాలా తేలిగ్గా సైగల భాష పలికేస్తుంటారు. సాధారణ వ్యక్తులు మీకు నోటితో స్వాగతం పలుకుతూనే సైగల్ని జోడిస్తారు. అంతగా వారి జీవనంలో, భాషలో శరీర భాష కలిసిపోయింది. అటుగా ఎవరైనా కోలోక్ పెద్ద మనిషి వస్తే గౌరవంగా చేతులు జోడిస్తారు. ఎందుకంటే కోలోక్‌లు గ్రామ రక్షకులు, దృఢమైనవాళ్లు. ఎంతటి సాహసాన్నైనా చేయగలిగే ధైర్యస్తులు. గ్రామంలోని ముఖ్యమైన విషయాలన్నీ కోలోక్‌ల సంఘమే చూసుకుంటుంది. న్యోమాన్ సాంతియా అనే ఊరి కోలోక్ పెద్ద 42 మంది కోలోక్‌లతో కలిసి ఓ సంఘాన్ని ఏర్పాటు చేశాడు. వీరు గ్రామ బాధ్యతల్ని భుజానెత్తుకున్నారు. గడ్డు పరిస్థితుల్లో పక్క గ్రామాల వారు కూడా కోలోక్‌ల అండ కోరతారు. ఆ గ్రామంలోని శ్మశానంలో దేవా కోలోక్ గుడి ఉంది.

అసలు కారణమది!

ఇక్కడ ఇంతమందికి ఈ వినికిడి, మాట సమస్య రావడానికి గల కారణాన్ని శాస్త్రవేత్తలు పసిగట్టారు. అరుదైన భౌగోళిక కేంద్రానికి పరిమితమైన ఓ జన్యులోపం వల్ల ఆ ప్రాంతంలోనే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నిర్ధారించారు. డీఎఫ్ఎన్‌బీ3 అనే రెసెసివ్ జీన్ అది అని కూడా పేర్కొన్నారు.

జాంగర్ కోలోక్

అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందాలెన్నో ఇక్కడ పరిశోధనలు జరిపి ఈ వాస్తవాలను వెలుగులోకి తెచ్చాయి. అయితే మామూలు దంపతులకు ఈ జన్యులోపంతో పిల్లలు కలగవచ్చు. జన్యు లోపం ఉన్న దంపతులకు మామూలు పిల్లలు ఉండవచ్చు. ఇది 7 తరాల నుంచి వస్తోంది. ముఖ్యంగా ముందటి తరాల్లో ఎక్కువ మంది ఈ జన్యులోపంతో ఉండేవాళ్లు. ఏదైతేనేం వందల ఏళ్ల నుంచి సైగల భాష (కాటా కోలోక్)కు అలవాటు పడిన గ్రామస్తులు దాన్నే ప్రధాన భాషగా మార్చుకునే వరకు పరిస్థితులు వెళ్లాయి. ఓ రకంగా ఈ ప్రత్యేకతే ఆ గ్రామానికి ఆదాయాన్ని కూడా పెంచుతోంది. ప్రపంచ మారుమూలల నుంచి కూడా పర్యాటకులు ఈ గ్రామానికి వచ్చి సందర్శిస్తున్నారు. ముఖ్యంగా మూగ, బధిరుల బృందాలు ప్రత్యేకంగా ఇక్కడ కొన్ని రోజుల పాటు ఉండి ఈ భాషను నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే మిగతా సైగల భాషలకు చాలా సాంకేతికత ఉంటుంది. చేతి వేళ్లు, కళ్లతో చేసే సంజ్ఞలతోనే విషయాలన్ని చెప్పాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ చుట్టు ఉన్న పరిసరాలను కలుపుకుని చాలా తేలిగ్గా అర్థం చేసుకునే శైలిలో ఉంటుంది. వందల ఏళ్ల నుంచి ఇది అభివృద్ధి చెందడంతో చాలా ప్రాక్టికల్‌గాను ఉంటుంది. జాంగర్ కోలోక్ నృత్యంలో అయితే వారి హావభావాలు మిగతా నృత్యశైలుల మెరుగుకు బాగా ఉపయోగపడే అవకాశం ఉంది. కోలోక్‌లు ఎక్కువగా ఈ నృత్యాన్ని మాధ్యమంగా చేసుకుంటానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుతం 16 మంది కోలోక్‌లు నెలలో మూడు సార్లు చొప్పున వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తూ ఆ నృత్యాన్ని ఇండొనేషియా అంతటా చొచ్చుకుపోయేలా కృషి చేస్తున్నారు.

✦


మద్యాం విధానం
కాటేసిన మద్యం
గంగాధర్
మరుగేలరా! మరుగేలరా!! మరుగా...!!
ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల కరువు
నాన్‌వెజ్ న్యూడిల్స్.. అని మేనేజ్ చెయ్యవోయ్!!
SALES
రామ్‌దేవ్ న్యూడిల్స్‌లో పురుగులు
సార్‌కి.. అప్పుడే చలి మొదలైంది!!
అంగన్‌వాడీ
మున్సిపల్ కార్మికులు
ప్రైవేటు ఉద్యోగులు!
17 నుంచి శీతాకాల సమావేశాలు

కార్టూన్ పంచ్

కాలుష్య ప్ర'తాపం'

-సత్యాజీ
9490099167

వంటకు మంట కావాలి.
అలా అని ఏకధాటిగా అధిక సెగ కొనసాగిస్తే ...?
మొక్కకు నీరు కావాలి.
అందుకని నీటితోనే కుండీని నింపేస్తే ...?
సేద తీరటానికి చల్లని గాలి కావాలి.
సరేలే అని మంచుకొండల మధ్య పవళించమంటే ....??
అమ్మో ... !!
అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. గిన్నెతో సహా అన్నం మాడిపోతుంది. చివురు తొడగదు సరి కదా, మొక్క చచ్చిపోతుంది. విశ్రాంతి కాదు కదా, విపరీత చలికి శరీరం గజగజలాడిపోతుంది!
ఇప్పుడు ఇలాగే ఉంది మన భూగోళం పరిస్థితి! అంతా అల్లకల్లోలం. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాలు, అధిక చలిగాలులతో అతలాకుతలం అయిపోతోంది! ఇదంతా భూ వాతావరణం వేడెక్కటం (భూతాపం : గ్లోబల్ వార్మింగ్) వల్ల తలెత్తిన గందరగోళం! ప్రపంచం యావత్తూ ఎదుర్కొంటున్న పెను ప్రమాదం!

కాలం గతి తప్పుతోంది!

ఏ వ్యవస్థకైనా కొన్ని నియమాలు ఉంటాయి. పద్ధతులు ఉంటాయి. నియంత్రణలూ ఉంటాయి. కాలాలూ ధర్మాలూ ఉంటాయి. ఇవన్నీ సవ్యంగా ఉంటే- వాతావరణం హాయిగా ఉంటుంది. భూమి అందంగా ఉంటుంది. జీవరాశి ఆనందంగా ఉంటుంది.

అదుపు తప్పితే ... ?

కాలాలు క్రమం మరిచిపోతాయి. ప్రకృతి ధర్మాలు నియంత్రణ కోల్పోతాయి. విపరీతాలూ, విధ్వంసాలూ సంభవిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా- విపరీతమైన ఎండలు. వేసవిలో ఉష్ణోగ్రత తరచూ 40 డిగ్రీలు దాటిపోతోంది. చలి కూడా అంతే! విపరీతంగా గజగజలాడిస్తుంది. వర్షాలు కాలం కాని కాలంలో కుండపోత కుమ్మరిస్తాయి. అన్నీ అధికమే! ప్రాణాలు తీసేంత అధికం! ప్రళయమో, విలయమో సృష్టించేంత అధికం!

గరంగరంగా వాతావ'రణం'!

ప్రపంచం ఇప్పుడు నిప్పుల కుంపటి మీద ఉంది. వరదల గుప్పిట్లో ఉంది. చలిగాలుల సందిట్లో ఉంది. మొత్తంగా చూస్తే- విపరీతాలు, విధ్వంసాల బాటలో ఉంది. అభివద్ధి పేరిట మానవాళి సష్టిస్తున్న కాలుష్యం, అడవుల నరికివేత ... శాపంగా పరిణమించాయి. ఫలితంగా పర్యావరణం మొత్తం గాడి తప్పింది.

పర్యావరణ విధ్వంసాన్ని అడ్డుకునేందుకు, భూతాపం తగ్గించేందుకు ప్రతి దేశం సిద్ధం కావాలని ఐక్యరాజ్యసమితి రెండు దశాబ్దాలుగా కషి చేస్తోంది. అన్ని దేశాల్లో పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల వినియోగం బాగా పెరిగింది. దీనివల్ల వాతావరణంలో కర్బన ఉద్గారాలు పేరుకుపోతున్నాయి. భూతాపం

పెరగటానికి ఇదే ప్రధాన కారణం. పారిశ్రామిక విప్లవానికి ముందరి స్థాయిలతో పోలిస్తే భూ ఉష్ణోగ్రత దాదాపు ఒక డిగ్రీ పెరిగింది. పరిస్థితి ఇంకా దిగజారకుండా ఉండాలీ అంటే- కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలి. కానీ, వాస్తవం దీనికి వ్యతిరేకంగా ఉంది. మండే ఇంధనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. భూమిని ప్రశాంతంగా, పచ్చగా ఉంచటానికి ప్రత్యేక కృషి చేయాలి. ప్రపంచ దేశాలన్నిటికీ ఒక కార్యాచరణ ఉండాలి. దీనికోసం 1992లో రియో డిజెనీరోలో నిర్వహించిన ధరిత్రీ సదస్సు నుంచీ ఐరాస కృషి చేస్తోంది. దీనివల్ల దేశాలన్నిటా పర్యావరణ పరిరక్షణ స్పృహ పెరిగింది. అయితే, స్పష్టమైన లక్ష్యాలతో కూడిన ఉమ్మడి కార్యాచరణ ఇంకా దూరంగానే ఉంది.

ప్రకృతి ప్రకోపం!

భూగోళం రోజురోజుకూ వేడెక్కిపోతోంది. ఓజోన్ పొర చిల్లులు పడుతోంది. ఆర్కిటిక్ ప్రాంతంలో ఉపరితల మంచు ఏటా 13 శాతం కరిగిపోతోంది. దీంతో, అకాల వరదలు, సముద్ర మట్టాలు పెరగటం వంటి పరిణామాలు సంభవిస్తున్నాయి. 1870-2000 మధ్య సముద్ర మట్టాలు 18 సెం.మీ. పెరిగాయని, ఈ పెరుగుదల కొద్ది సంవత్సరాలుగా మరింత వేగవంతమైందని శాస్త్రవేత్తల నిర్ధారణ. సముద్ర మట్టం గత 20 ఏళ్లలో సగటున 6 సెంటీమీటర్లకు పైగా పెరిగింది.

పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం భూతాపం పెరగటానికి మరొక కారణం. దీనిపై ఇప్పుడిప్పుడే పారిశ్రామిక రంగం అప్రమత్తం అవుతోంది. అయితే, అభివృద్ధి చెందిన దేశాల్లోని కాలుష్య కారక పరిశ్రమలు మనలాంటి వర్ధమాన దేశాలకు
తరలివస్తున్నాయి. నియంత్రణకు అన్ని చోట్లా ఒకేలాంటి పద్ధతులూ, ప్రమాణాలూ పాటించకపోవడమే దీనికి కారణం. కర్బన ఉద్గారాలకు కారణమవుతున్న పరిశ్రమలు రెండు దశాబ్దాల కాలంలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో నిషేధానికి గురి కాగా, అవి భారత్ వంటి వర్ధమాన దేశాలకు తరలి వచ్చాయి, వస్తున్నాయి. అకాల వర్షాలు, అనూహ్య వరదలు అస్తవ్యస్తమైన వాతావరణ దుష్ఫలితాలే! చెన్నై వరదలు మనకొక తాజా ఉదాహరణ. పాకిస్తాన్‌ను ముంచెత్తిన వరదలకు హిమాలయాల్లో మంచుఫలకాలు కరిగిపోవడమే కారణం.

ఈ శతాబ్దిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు

గడిచిన వందేళ్లలో భూ ఉపరితల సరాసరి ఉష్ణోగ్రత 0.85 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది. 14 అత్యంత వేడిమి సంవత్సరాల్లో 13 ఈ శతాబ్దంలోనే నమోదయ్యాయి. చరిత్రలో ఇప్పటివరకూ 2014... అత్యంత ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరం. పరిస్థితి ఇలాగే కొనసాగితే ... 21వ శతాబ్దాంతానికి భూతాపం 4.5 డిగ్రీల వరకూ పెరగొచ్చట! దీనివల్ల 2100 నాటికి సముద్ర మట్టం 26 సెం.మీ. నుంచి 82 సెం.మీ వరకూ పెరగొచ్చు! ఫలితంగా అనేక దీవులు, తీర ప్రాంతాలు, డెల్టాలు జలసమాధి అయిపోతాయి. తాగునీరు దొరక్కపోవచ్చు. ఆహారోత్పత్తి అస్తవ్యస్తమైపోతుంది. వరదలు, తుపాన్లు, వడగాలులు, కరవులు ప్రపంచాన్ని కమ్మేస్తాయి!

అమెరికా తీరు మారాలి!

'భూతాపం తగ్గాలి.. మేం మాత్రం తగ్గం' అంటోంది అమెరికా. అన్ని దేశాలూ 2030 వరకూ తమ ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను ప్రకటించాలని ఐరాస సూచించింది. అమెరికా, భారత్, చైనా సహా 148 దేశాలు తమ లక్ష్యాలను ప్రకటించాయి. ప్రపంచ ఉద్గారాల్లో వీటి వాటా 91 శాతం. ఈ హామీల ప్రకారం చూస్తే 2100 నాటికి భూతాపం 2.7 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమవు తుందని అంచనా. 2 డిగ్రీల లక్ష్యానికి పరిమితం కావాలంటే ఉద్గారాలను మరింతగా తగ్గించుకోవాలి. ప్రధాన ఉద్గార దేశమైన అమెరికా అంతర్జాతీయ ఒప్పందాలపై విముఖత ప్రదర్శిస్తోంది. 1997లో కుదిరిన క్యోటో ప్రోటోకాల్‌ను కూడా ఆమోదించలేదు. ఒప్పందంపై సంతకం చేసిన పలు దేశాలు ఇదే తోవ నడిచాయి. వాటి వైఖరి మారకుండా వాతావరణంలో మార్పు కష్టమే!

మన చేతల వల్లే ఈ వెతలు ...

1991-2011 మధ్య 29 వేల మంది పరిశోధకులు వెల్లడించిన నిర్ధారణల ప్రకారం... భూతాపం పెరగటానికి మానవాళి చర్యలే కారణం. మనం సష్టిస్తున్న పర్యావరణ విధ్వంస ఫలితమే ఈ పెనుమార్పులని 97.1 శాతం మంది సైంటిస్టులు స్పష్టం చేశారు. పర్యావరణ సమతౌల్యం దెబ్బతినటం వల్ల ఎన్నో జంతు, వృక్ష, పక్షి జాతులు అంతరించిపోతున్నాయి. మొత్తం జంతు, వక్ష జాతుల్లో 20-30 శాతం ఈ అంతర్ధాన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి.

నాలుగొందల ఏళ్ల క్రితం భూమిపై దాదాపు 70 శాతం మేర అడవులే ఉండేవి. ఇప్పుడు సగానికి సగం తగ్గిపోయాయి. 2000-12 మధ్య ప్రపంచవ్యాప్తంగా దాదాపు 230 లక్షల హెక్టార్ల అడవులను నరికివేశారని అంచనా. అడవులను నరకటం అంటే పర్యావరణాన్ని చేతులారా నాశనం చేయటమే!

ఎవరి బాధ్యత ఎంత?

భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరగటానికి ఎవరిదెంత పాత్ర అన్నది ప్రశ్న. ప్రపంచ కర్బన కాలుష్యంలో సగానికి సగం సష్టిస్తున్నది 10 శాతం సంపన్న దేశాలే! నివారణకు, నియంత్రణకు అవి అంతే మోతాదులో బాధ్యత వహించటం ధర్మం. కానీ, అమెరికా వంటి అగ్రదేశాలు అందుకు సిద్ధపడటం లేదు. భారాన్ని అందరం కలిసి పంచుకుందాం అంటున్నాయి. దీనిని సహజంగానే వర్ధమాన దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. ఎవరు ఎంత

కాలుష్యానికి కారకులో అంతే బాధ్యత తీసుకోవాలని అవి నొక్కి చెబుతున్నాయి. క్యూబా వంటి దేశాలైతే

ఈ పాపం అంతా అమెరికా, దాని మిత్రదేశాలదేనని, వారే ప్రపంచానికి పరిహారం చెల్లించాలని స్పష్టం చేస్తున్నాయి. పెద్ద దేశాల ద్వంద్వవైఖరి వల్లే భూతాపం నియంత్రణపై స్పష్టమైన కార్యాచరణ రూపొందటం లేదు!

నియంత్రణ ఎలా?

భూతాపాన్ని ఎలా అరికట్టాలి? ఎటువంటి సాంకేతికతలను అనుసరించాలి? కొత్త ప్రక్రియలతో సహజంగా ఉండే సమస్యలను ఎలా అధిగమించాలి? ఇవన్నీ ప్రశ్నలే! దీనిపై శాస్త్రవేత్తలు అనేక నివారణోపాయాలు ప్రతిపాదిస్తున్నారు.

- బొగ్గు, పెట్రోల్, డీజిల్, సహజ వాయువు వంటి హైడ్రో కర్బన ఇంధనాల్లో కర్బనం ఉంటుంది. ఈ ఇంధనాలను మండించినప్పుడు కార్బన్ డయాక్సైడ్ విడుదలవుతుంది. వాతావరణంలో వేడి పెరగటానికి ఇదే కారణం. కాబట్టి- మండించ నవసరం లేని ఇంధనాలపై దష్టి పెట్టాలనేది శాస్త్రవేత్తల సూచన. గాలీ, నీరూ, సూర్యుడి వేడీ ఆధారంగా శక్తిని ఉత్పత్తి చేస్తే- కార్బన్ డయాక్సైడ్ సమస్య ఉత్పన్నం కాదు. పైగా ఇవి పరిమితి లేని వనరులు. వినియోగిస్తే తరిగిపోతాయనే భయం లేదు. ప్రక తి సహజంగా అవి ఎప్పటికప్పుడు భర్తీ అవుతాయి. వీటిని పునర్వినియోగ ఇంధనాలు అంటారు. బొగ్గు, చమురు వంటి ఇంధనాలు భూమిపొరల్లో నిక్షిప్తమై ఉంటాయి. వాడినకొద్దీ తరిగిపోతాయి. వెలికితీత వ్యయం కూడా ఎక్కువే! ఏ రీత్యా చూసినా సౌర, పవన ఆధారిత ఇంధనం మనకు చాలా అవసరం, శ్రేయస్కరం!
- కర్బన ఉద్గారాలు లేకుండా విద్యుదుత్పాదనకు అణుశక్తి ఒక ప్రత్యామ్నాయమనే వాదన ఉంది. అయితే, దీనివల్ల తీవ్ర ప్రమాదం కూడా ఉంది. రేడియో ధార్మిక వ్యర్థాల విడుదల, పేలుడు సంభవిస్తే జరిగే విపరిణామాల దృష్ట్యా ఈ ప్రక్రియకు అంత ఆమోదం లేదు. రక్షణరంగ ఒప్పందంలో భాగంగా అమెరికా మన దేశానికి అంటగడుతున్న అణు రియాక్టర్లు కూడా పర్యావరణానికి కీడు కలిగించేవేనని నిపుణులు చెబుతున్నారు.
- వాతావరణంలోకి విడుదల కాకముందే కర్బన ఉద్గారాలను భూగర్భంలో పూడ్చిపెట్టొచ్చనేది ఒక ఆలోచన. దీనిని 'కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజీ (సీసీఎస్) అంటారు. ఈ ప్రక్రియను బొగ్గు, సహజ వాయువు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద ఉపయోగించవచ్చు. చమురు శుద్ధి కేంద్రాలు, సిమెంట్ కర్మాగారాలు, పెట్రో కెమికల్ ఫ్యాక్టరీల వద్ద కూడా పాటించవచ్చు. అయితే, దీనిని పారిశ్రామిక యాజమాన్యాలు అనుసరించటం సందేహాస్పదమే!
- భూతాపాన్ని ఎదుర్కోవటానికి వాతావరణాన్ని మార్చవచ్చని మరొక సూచన. వాతావరణంలో రెండోపొరగా ఉండే స్ట్రాటోస్ఫియర్‌లోకి సల్ఫేటు కణాలను వెదజల్లటం వల్ల భూమి ఉష్ణోగ్రతలను పెరగకుండా చూడవచ్చునట! అగ్నిపర్వతాలు పేలినప్పుడు సల్ఫేటు కణాలు ఆ ఆవరణంలోకే విడుదలవుతాయి. సహజంగా జరిగే ఈ ప్రక్రియను భూతాప నియంత్రణకు కత్రిమంగా సృష్టించాలని శాస్త్రవేత్తల యోచన. అయితే..

ఎల్‌నినో అంటే ...

దక్షిణ అమెరికా వద్ద గల పెరూ తీరం సమీపంలో పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఉండాల్సిన దాని కంటే 2 లేదా 3 డిగ్రీలు ఎక్కువ ఉండటాన్ని ఎల్‌నినో అంటారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచీ ఎల్‌నినో ప్రభావం మొదలైంది.మరోవైపు హిందూ మహాసముద్రంలో భూమధ్య రేఖకు ఇరువైపులా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు తక్కువ వర్షం ఇవ్వడానికి, ఈశాన్య రుతు పవనాలు విజృంభించడానికి కారణం ఎల్‌నినోయే!

ప్రభావ తీవ్రతను బట్టి ఎల్‌నినో నాలుగు రకాలు. వీక్ ఎల్‌నినో, మోడ్రెట్ ఎల్‌నిలో, స్ట్రాంగ్, వెరీ స్ట్రాంగ్ ఎల్‌నినో. ఈ ఏడాది ఏర్పడిన ఎల్‌నినో మోడ్రెట్, స్ట్రాంగ్ ఎల్‌నినోలుగా వాతావరణ శాఖ నిపుణులు, ఎయు వాతావరణ శాఖ ప్రొఫెసర్ ఓఎస్ఆర్‌యు భానుకుమార్ వివరించారు. ప్రారంభంలో బలహీనంగా మొదలై తర్వాత మోడ్రేట్‌గా మారిందని, తర్వాత స్ట్రాంగ్ పొజిషన్‌కు వెళ్లి ప్రస్తుతం వీక్‌గా మారుతోందని తెలిపారు. డిసెంబరు నెలాఖరుకు ఎల్‌నినో ప్రభావం పూర్తిగా పోతుందని చెప్పారు. సాధారణంగా ఎల్‌నినో 5 నుంచి 8 ఏళ్ల వ్యవధిలో ఏర్పడుతుంది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఇప్పుడు ఆ వ్యవధి 3 - 4 ఏళ్లకు తగ్గింది. ఒసానిక్ నినో ఇండెక్స్ (ఒఎన్ఐ) నెగిటివ్‌గా చూపిస్తే 'లా నినా'గా; పాజిటివ్‌గా చూపిస్తే ఎల్‌నినోగా పరిగణిస్తారు.

ఎల్‌నినోతో అకాల వర్షాలు

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్లే దక్షిణ భారతదేశంపై ఇటీవల ఈశాన్య రుతు పవనాలు విరుచుకుపడ్డాయి. నెల రోజుల పాటు కుండపోత వర్షాలు కురి శాయి. ఈ జడివానలకు తమిళనాడు, కేరళ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, మన రాష్ట్రంలో నెల్లూరు, చిత్తూరు జిల్లాలూ అతలాకుతలం అయ్యాయి. చెన్నై నగరం చిగురు టాకులా వణికిపోయింది. దక్షిణ భారతదేశం సగటు వర్షపాతం 37.3 సెం.మీ. కాగా, దీనికి నాలుగు రెట్లు నమోదైంది! ఈశాన్య రుతు పవనాలు దక్షిణ భారత దేశానికి పరిమితం. వీటి ప్రభావంతో నైరుతి, ఆగ్నేయ బంగాళా ఖాతంలో అల్ప పీడ నాలు, వాయు గుండాలు ఏర్పడటం సహజం. ఒక్కోసారి తుపాన్లు, పెను తుపాన్లు రావొచ్చు. అయి తే, ఈ ఏడాది ఒక్క తుపానూ రాలేదు. వర్షపాతం మాత్రం రికార్డు స్థాయిలో నమోదైంది. ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో అక్టోబరులో రెండు లేదా మూడు; నవంబరు, డిసెంబరు నెలల్లో 3 లేదా 4 అల్పపీడనాలు ఏర్పడతాయి. ఈసారి నెల వ్యవధిలో 6 అల్ప పీడనాలు, ద్రోణులు ఏర్పడ్డాయి.



లా నినా అంటే ...

ఎల్‌నినోకు పూర్తి విరుద్ధంగా ఉండటమే లా నినా. పసిఫిక్ సముద్రం ఉపరితల జలాల్లో ఉండాల్సిన దానికంటే 2 లేదా 3 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గితే ఇది ఏర్పడుతుంది. లా నినా ఏర్పడితే రుతు పవనాలు అంతగా ప్రభావితం చూపవు. కరువు పరిస్థితులు ఏర్పడతాయి.

సల్ఫేట్ కణాలను భారీఎత్తున భూవాతావరణం లోకి విడుదల చేస్తే ఎలాంటి పరిణామాలు సంభవి స్తాయన్నది ప్రశ్న. ఇది మరొక ప్రమాదానికి దారి తీయొచ్చు కూడా!

ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత

- భూతాపాన్ని ఎదుర్కోవటానికి సాంకేతికంగా కొత్త మార్గాలను అన్వేషించటం ఒక్కటే సరిపోదు. ఈ విషయంలో ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించాలి. అడవులను సంరక్షిం చేలా చూడాలి. దీనికోసం సంపన్న, అభివద్ధి దేశాలు పేదదేశాలకు ఆర్థికంగా, ఇతరత్రా ప్రోత్సాహకాలివ్వాలి. పర్యావరణానికి కీడు చేసే పారిశ్రామిక విధానాలకు స్వస్తి చెప్పాలి.
- ఉద్గారాల తగ్గింపునకు సంపన్న దేశాలు ఇచ్చే హామీలు అమలయ్యేలా అంతర్జాతీయంగా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలి!
- బొగ్గు, సహజ వాయు నిక్షేపాలున్న ప్రాంతాల్లో తవ్వకాలు జరపకూడదు. ఆ ప్రాంతాల ప్రజలకు, ప్రభుత్వాలకు అంతర్జాతీయ సంస్థ ఆర్థిక సాయం చేయాలి.
- భూతాపం నివారణపై పెద్దఎత్తున ప్రచారం జరగాలి. సౌర, పవన ఆధారిత ఇంధనాల ప్రయోజనం వివరించాలి. ఈ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వాలు పూర్తి సహాయ సహకారాలు అందివ్వాలి.
- చెరువులు, కాలువలు, నదులు వంటి వాటిని పరి రక్షించడం ప్రభుత్వం, ప్రజల బాధ్యతగా ఉం డాలి. కబ్జాల పట్ల కఠినంగా వ్యవహరించాలి.
- ప్రకృతి సహజ వనరులను కరెంటు అవసరాలకు వినియోగిస్తే- 2050 నాటికి - సౌరశక్తి ద్వారా 77 శాతం, పవనశక్తి ద్వారా 20 శాతం, జలశక్తి ద్వారా 3 శాతం కరెంటు అవసరాలను తీర్చుకోవచ్చు.
- ప్రత్యామ్నాయ ఇంధనవనరుల ద్వారా జరిపే విద్యుదుత్పత్తితో ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. నిర్మాణ రంగంలో 19 లక్షల మందికి, నిర్వహణ రంగంలో 17 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఒక అంచనా. పర్యావరణానికి విఘాతం కలగదు కాబట్టి.. ఆరోగ్య సమస్యలు, వాటిపై పెట్టే ఖర్చు గణనీయంగా తగ్గుతాయి.

భూమి అందంగా నవ్వాలి!

మన భూమిని మనం క్షేమంగా ఉంచితేనే మనకూ క్షేమం. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా నాశనం చేస్తే మనకూ పతనమే! మన దేశ పాలకుల్లో ఈ స్పృహ పెరగాల్సి ఉంది. చెట్లు నాటితే చాలు, సమస్య పరిష్కారం అన్నంత చిన్నది కాదు ఈ ప్రమాదం. ప్రకృతి వనరులు నాశనం కాకూడదు. బాక్సైటు, ఇతర ఖనిజాల కోసం కొండలను తవ్వేస్తే- చివరికి విధ్వంసమే మిగులుతుంది. చిత్తడి నేలలను కబళించినా మానవాళికి కష్టమే! చిత్రం ఏమిటంటే- మన దేశ పాలకులు అంతర్జాతీయ వేదికలపై ఎన్నో కబుర్లు చెప్పి, ఇక్కడ అందుకు భిన్నమైన ఆచరణకు దిగుతున్నారు. గిరిజనులు, మత్స్యకారులు, పర్యావరణవాదులు, శాస్త్రవేత్తలూ నెత్తీనోరూ మొత్తుకున్నా- అభివృద్ధి పేరిట విధ్వంస రచనకు పూనుకుంటున్నారు. తీరప్రాంతపు వైవిధ్యమూ, గిరిజన ప్రాంతాల సౌభాగ్యమూ మన భూమికి, తద్వారా మనకూ రక్ష. వాటి పరిరక్షణ మనందరి బాధ్యత, కర్తవ్యం!

'వానల్లు కురవాలి
వనమెల్లా మురియాలి
నదులన్నీ పారాలి
నెమలమ్మ ఆడాలి
ఆకుపచ్చని భూమి
అందంగా నవ్వాలి!

ఈ గేయం పిల్లలదే కావచ్చు గాక! కోరిక మాత్రం పెద్దది. దానిని నెరవేర్చే బాధ్యత పిల్లలది, పెద్దలది; ప్రపంచంలోని అందరిదీ!

✦

భూతాపం వల్లే చెన్నై వరదలు

భూతాపం ఫలితంగానే చెన్నైలో కుండపోత వర్షాలు సంభవించాయి. జనజీవనం అతలాకుతలం అయింది. వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే విపరిణామాలకు ఇదొక తాజా ఉదాహరణ. ప్రపంచ ఉష్ణోగ్రతలు సగటున ఒక డిగ్రీ మేరకు పెరిగాయి. ఆ ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్నాయి. ఇక 2 డిగ్రీలు పెరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

- చంద్రభూషణ్,

డిప్యూటీ డైరెక్టర్ జనరల్, వాతావరణ వైజ్ఞానిక కేంద్రం, న్యూఢిల్లీ.

భూతాపంపై అవగాహనా క్రమం ..

గ్లోబల్ వార్మింగ్‌కు 120 ఏళ్ల చరిత్ర ఉంది. దీని గురించి ప్రపంచానికి తొలిసారిగా చెప్పిన శాస్త్రవేత్త స్వీడన్‌కు చెందిన స్వాంటే అర్హీనియస్ (1859-1927). వాతావరణంలో కార్బన్ డయా క్సైడ్ మోతాదుకు, వాతా వరణ ఉష్ణోగ్రతకు దగ్గరి సంబంధం ఉందని ఆయన చెప్పాడు. బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను మండించటం వల్ల కార్బన్ డయాక్సైడ్ తదితర వాయు వులు వాతావరణంలోకి విడుదలై భూమి ఉష్ణోగ్రత పెరుగుతుందని 1896 లో ప్రతిపాదించాడు. భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా లెక్కగట్టాడు. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ మోతాదు రెట్టింపైతే భూ ఉష్ణోగ్రత మరో 5 డిగ్రీల మేరపెరుగుతుందని అంచనా.

- 1940లలో పరారుణ స్పెక్ట్రోస్కోపీ రంగంలో వచ్చిన తరువాత గ్లోబల్ వార్మింగ్‌కు సంబంధించి కొంత స్పష్టత వచ్చింది. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ ఎంతగా పెరిగితే పరారుణ రేడియో ధార్మికతను వాతావరణం అంత ఎక్కువగా గ్రహిస్తుందని తేలింది. గిల్బర్ట్ ప్లాస్ అనే శాస్త్రవేత్త 1955లో ఈ పరిశోధనల ఫలితాలను క్రోడీకరించాడు. మానవ కార్యకలాపాల కారణంగా విడుదలయ్యే కార్బన్ డయా క్సైడ్‌లో మూడోవంతును మాత్రమే సము ద్రాలు తమలో ఇముడ్చుకుంటు న్నాయని, మిగిలిన భాగం వాతావరణంలోనే పోగుపడు తుందని తేలింది. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ జీవితకాలం దాదాపు పదేళ్లని నిర్ధారణ అయింది.
- 1960 మొదట్లో చార్లెస్ కీలింగ్ అనే శాస్త్రవేత్త.. అంటార్కిటికా, మౌనాలోవాల్లో కార్బన్ డయాక్సైడ్ మోతాదుపై పట్టికలు రూపొందించాడు. అప్పుడే మంచుయుగాలు ఏర్పడొచ్చే మోనన్న వాదనలు ముందుకు వచ్చాయి.
- 1980ల చివరికి ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల వేగంగా, విస్పష్టంగా ఉండటంతో మంచు యుగం వాదన కనుమరుగైంది. ఈ శతాబ్దంలో అత్యధిక ఉష్ణోగ్రత తొలిసారిగా 1988లో నమోదైంది. భూతాపం పెరగటంపై విస్తృత ప్రచారం, చర్చా మొదలయ్యాయి.
- ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం, ప్రపంచ వాతావరణ సంస్థ ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ సంఘం' (ఐపీసీసీ) 1988లో ఏర్పాటైంది. ఇందులో 195 సభ్య దేశాలు ఉన్నాయి.
- వాతావరణ మార్పులపై ఐపీసీసీ ఇప్పటివరకూ ఐదు నివేదికలు (1992, 96, 2001,07,14లలో) విడుదల చేసింది. తొలి నివేదికపై 1992లో బ్రెజిల్‌లోని రియో డిజెనిరోలో భూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో 'వాతావరణ మార్పులపై ఐరాస మౌలిక ఒప్పందం' (యూఎన్ఎఫ్‌సీసీసీ) రూపొందింది.కర్బన ఉద్గారాలను నియంత్రించటం ఈ ఒప్పందం లక్ష్యం.
- 1994 నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందంపై గతేడాది మార్చి నాటికి అన్ని దేశాలూ సంతకం చేశాయి. సభ్య దేశాలు 1995 నుంచి ఏటా సమావేశమవుతున్నాయి. ఫ్రాన్స్‌లో ఇటీవల జరిగింది 21వ సీఓపీ.

చోర్ బజార్!

పోగొట్టుకున్నవి అక్కడ కొనుక్కోవచ్చు!

ముంబై నగరంలో కాలూనిన ప్రతి ఒక్కరు తప్పక చూడాలనుకునే... చూడాల్సిన... బజారు ఒకటుంది. అదే 'చోర్ బజార్'. దక్షిణ ముంబై ... మటన్ బజార్ సమీపంలో వున్న అతి పెద్ద సంత ఇది. పిన్ను నుంచి పియానో వరకు ఎంత అరుదైన వస్తువైనా... విడిభాగమైనా సరే ... ఇక్కడ లభిస్తుంది. అమ్మకానికి పెట్టేవాటిలో దొంగ సొత్తు, పాత వస్తువులే అధికం. దేశీయ విదేశీ పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ బజార్ విశేషాలేంటో చూద్దాం.

నా నమ్మకు ప్రీతిపాత్రమైన పడక్కుర్చీ నట్టు ఊడిపోయింది. తాతయ్యకు ఎంతో ఇష్టమైన పాత కాలపు ఫోన్ వైరు తెగిపోయింది. పిల్లగాడికి పెన్సిళ్లు, బ్యాగులు కొనాలి. కొత్తగా కాలేజీలో చేరిన కుర్రోడికి వాచీ కావాలి. ఇలాంటివన్నీ బయట మార్కెట్లో కంటే కాస్తో కూస్తో చవగ్గా దొరికే చోటు 'చోర్ బజార్'. కాకపోతే బేరం ఎంత బాగా ఆడగలిగితే అంత చవగ్గా వస్తువులను సొంతం చేసుకోవచ్చు. గీసి గీసి బేరం ఆడాలన్నమాట. నాసిరకపు భవనాలు, కిక్కిరిసిన జనాలతో సంత సందడి సందడిగా వుంటుంది. జేబులో పర్సులు పోయినా, వంటిమీద విలువైన నగ నట్రా మాయమైనా ఎవ్వరినీ ఏమీ అడగడానికి వుండదు. ఇక్కడ ఎవరి పర్సులకు, నగలకు వారే బాధ్యులు.

షోర్...చోర్ అయ్యింది

మొదట్లో దీన్ని 'షోర్ బజార్' అనేవారు. అయితే బ్రిటిష్ వాళ్లకు నోరు తిరక్క 'చోర్ బజార్' అనడం మొదలెట్టారట. తెలుగులో చెప్పుకోవాలంటే 'దొంగల బజార్'. దీనికి మరో కథనం కూడా ప్రచారంలో వుంది. విక్టోరియా రాణి ఓసారి ముంబై వచ్చిందట. ఓడ దిగాక ఆవిడగారి సామాను కిందికి దించారు. సరిగ్గా ఆ సమయంలో ఒక వయొలిన్, ఇతర కొన్ని సామగ్రి పోయాయి. కొద్ది రోజుల తర్వాత అవి చోర్ బజార్లో ప్రత్యక్షమయ్యాయి. దాంతో షోర్ బజార్ కాస్తా చోర్ బజార్ అయ్యిందని చెప్తుంటారు. సంత కాబట్టి జనం ఎక్కువగా వస్తుంటారు. గోల గోలగా వుండడం సహజం. అందుకని మొదట్లో షోర్ బజార్ అని పిల్చేవారు. రాణిగారు పోగొట్టుకున్న వస్తువులు ఇక్కడ అమ్మకానికి వచ్చాయి కాబట్టి చోర్ బజార్ అయ్యింది. ఇప్పటికీ ముంబైలో ఎవరైనా ఏదైనా పోగొట్టుకుంటే కొద్ది రోజుల తర్వాత చోర్ బజార్‌లో కొనుక్కోవచ్చని చెప్తుంటారు. రచయితలు కూడా ఈ బజార్‌ను తమ రచనల్లో పేర్కొన్నారు. రోహింటన్ మిస్త్రీ 'ది లాంగ్ జర్నీ' తదితర నవలల్లోనూ చోర్ బజార్ ప్రస్తావన చేశాడు.

సర్వం దొరికే సంత

నూట యాభయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ బజార్‌లో గృహోపకరణాలు, ఇనుప వస్తువులు, కరెంటు సామాను, గాడ్జెట్లు, పురాతన వస్తువులు ...

ఇదీ అదీ అనేముంది? ప్రతిదీ లభిస్తుంది! ప్రతి రోజూ ఉదయం 11.00 నుంచి రాత్రి 7.30 గంటల వరకు దుకాణాలు తెరచే వుంటాయి. అది ముస్లిం సోదరులు ఎక్కువగా నివసించే ప్రదేశం కనక వారు ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా ప్రతి శుక్రవారం చోర్ బజార్‌కు సెలవు దినం. అయితే ఆ రోజున ఫ్రైడే బజార్ నడుస్తుంది. రోడ్డు మీదనే కిక్కిరిసినట్టుగా సామాన్లను పరిచేస్తారు. ఎక్కువ శాతం దొంగ సొత్తే అంటుంటారు.

కమనీయ కాంస్యం

ముందే చెప్పుకున్నట్టుగా ఇక్కడ అలంకరణ సామగ్రి చాలా ఎక్కువగా అందుబాటులో వుంటుంది. గృహాలంకరణను ఇష్టపడే వారు ఇక్కడికే వస్తుంటారు. మరీ ముఖ్యంగా కాంస్య విగ్రహాలు, వస్తువులు ఇక్కడ మాదిరిగా మరెక్కడా దొరకవేమో! వీటిని అమ్మే దుకాణాలు ఎక్కువగా కనిపిస్తాయి. దేవతా విగ్రహాలు, జంతువులు, పక్షులు మొదలుకొని నగల వరకు కావాల్సిన పరిమాణంలో లభిస్తాయి.

గ్రామొఫోన్లు

వింటేజీ గ్రామొఫోన్లంటే కొందరికి ప్రాణం. వాటిని సేకరించేందుకు ఎంతెంత దూరాలు ప్రయాణించడానికైనా వెనుకాడరు. అలాంటి వారికి చోర్ బజార్ సరైన చోటు. అందమైన గ్రామొఫోన్లను మరింత అందంగా వరుసగా అలంకరించి ఆకట్టుకుంటారు. అయితే అవి వింటేజీవే అని కచ్చితంగా చెప్పలేం. వెయ్యి రూపాయల వరకు వాటి ధర పలుకుతుంది.

బాలీవుడ్ పోస్టర్లు

కొందరికి పాత బాలీవుడ్ తారలన్నా, వారు నటించిన సినిమాలన్నా, అప్పటి పోస్టర్లన్నా చచ్చేంత ఇష్టం. వాటిని కొనుక్కొచ్చి హాల్లో అలంకరించే వరకూ తహతహలాడిపోతారు. అలాంటి వారు చోర్ బజార్ వెళ్తే చాలు. వారికిక సమయమే తెలీదు. అభిమాన తారల సినిమాల పేర్లు చెప్తే చాలు. క్షణాల్లో ఆయా పోస్టర్లను తీసుకొచ్చి ముందర పెట్టేస్తారు. బేరమాడి సొంతం చేసుకోవడమే తరువాయి. 'ఆలమ్ అరా, రామ్ శ్యామ్, డాన్, గైడ్, అజ్నబీ, అల్లాద్దీన్, గోపి, బహూ బేగమ్, చింగారి, గబ్బర్ సింగ్, లాఖోం మే ఏక్, తీన్ చోర్, సర్ఫరోష్... ' లాంటి అలనాటి చిత్రాల పోస్టర్లు పాత సినిమా ప్రియులను గంటల తరబడి నిలబెట్టేస్తాయి. నాటి హీరోలు, హీరోయిన్లు, ఐటమ్ గరల్స్, విలన్లు, వారి వస్త్రధారణ, కేశాలంకరణ... సందర్శకులను గిర్రున ఆ కాలంలోకి లాక్కెళతాయి. పైగా అప్పటి పోస్టర్ డిజైన్లు ఎలా వుండేవో కూడా అర్థమౌతుంది.



ఆ పాతవి ... అపురూపమైనవి...

కొందరికి పనికి రానివవి. మరికొందరికి అపురూపమైనవి. చోర్ బజార్‌లో ఏ దుకాణం చూసినా పాతవి, పాడైపోయిన వస్తువులే అగుపిస్తాయి. వర్ణచిత్రాలు, పాత వీల్ చైర్లు, విరిగిపోయిన పసిపిల్లల మంచాలు, ప్లాస్టిక్ టాయిలెట్ సీట్లు, భోజనం బల్లలు, కుర్చీలు, బేడీలు, కుర్చీ చక్రాలు, నట్లు, బోల్టులు అన్నీ కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. ఆ గుట్టల్లోంచి తమకు కావాల్సిన వస్తువును వెతుక్కొని సొంతం చేసుకుంటూ వుంటారు సందర్శకులు.

దీపాలు... గడియారాలు...

ఈ మార్కెట్లో కనిపించినన్ని రకాల దీపాలను మనం మరెక్కడా చూడలేమేమో. పాత కాలం నాటి వాటిని మొదలుకొని ఇప్పుడిప్పుడే మార్కెట్లలో చోటు చేసుకొంటున్న కొత్త రకం లాంతర్ల వరకు అన్నీ వుంటాయిక్కడ. వలస కాలం నాటివి, కిరోసిన్ హరికేన్ దీపాలు, గాజు దీపాలు, పింగాణీ దీపాలు, వేళ్లాడదీసే దీపాలు, ప్లాస్టిక్ దీపాలు... చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. పురాతన కాలపు కెమెరాలను సేకరించడమంటే కొందరికి చాలా ఇష్టం. అలాంటి వాళ్లకు ఇక్కడ బాక్సు కెమెరాల నుంచి 8 ఎం.ఎం. మూవీ కెమెరాల వరకు పలు రకాల వింటేజీ కెమెరాలు లభిస్తాయి.

వాహనాలు, యంత్రాలు, పాత ఫోన్లు, గ్రామొఫోన్లు...విడి భాగాలు సైతం ఇక్కడ అందుబాటులో వుంటాయి. సెకండ్ హ్యాండ్ బట్టలు, మొబైల్ ఫోన్లు, వాటర్ ప్రూఫ్ వాచీలు, నటరాజ్ పెన్సిళ్లు, స్కూలు బ్యాగులు సైతం ఇక్కడ అమ్ముతుంటారు. మోడర్న్ కళ్లజోళ్లు వాడీ వాడీ బోర్ కొడితే... అక్కడ పాతకాలపు కళ్లజోళ్లు కొనుక్కో వచ్చు. వంద రూపాయలకే ఇస్తుంటారు. పాత కాలపు ఇత్తడి దీపాలు సైతం 600 నుంచి 1200 రూపాయల మధ్యలో దొరుకుతాయి. అరబ్బులు, మొఘలుల కాలం నాటివని చెప్పే నాణేలు యాభై రూపాయల నుంచి 1500 రూపాయల వరకు పలుకు తుంటాయి. మెచ్చిన మోడల్ బూట్లు మొదలుకొని నచ్చిన రంగు కోట్లు వరకు... పాల క్యాన్లు మొదలు కొని టీ క్యాన్ల వరకు... కారు హారన్ల మొదలుకొని పశువుల గంటల వరకు అన్నీ అక్కడ దొరుకుతాయి. ఒకవేళ ఇవేవీ అవసరం లేని పక్షంలో ఆ దుకాణాల మధ్యగా నడుచుకుంటూ, చేతిలో కెమెరా వుంటే... ఫొటోలు తీసుకుంటూ వెళ్తుంటే చిత్రవిచిత్రమైన పాత వస్తువులు మనల్ని ఆశ్చర్యానందాల్లో ముంచెత్తుతాయి.

మానవత్వమే వారి మతం

నిషేధిత ఆహారం తిన్నాడేమోనన్న అనుమానం ఓ ముస్లిం ప్రాణాలను నిలువునా తీసేసింది.

ఒక ముస్లిం యువతి మీద పెంచుకున్న ప్రేమ అతణ్ణి నిర్జీవుణ్ణి చేసింది.

మూఢ నమ్మకాలను ప్రశ్నించినందుకు ఓ మేధావిని బుల్లెట్లు బలితీసుకున్నాయి.

మతం అనే మత్తుమందు చేయించినవే ఈ ఘోరఘటనలు. మతోన్మాదం తలకెక్కించుకున్న వారి కారణంగా ఇన్ని దుర్ఘటనలు జరుగుతున్నప్పటికీ... మతాలకు అతీతంగా స్నేహ పరిమళాలను వెదజల్లుతున్న వారు...అనాథలుగా మిగిలిపోయిన పరాయి మతస్తులను మానవత్వంతో అక్కున చేర్చుకుంటున్నవారు...ఆపదలో వున్న వారికి తమ ప్రాణం అడ్డు వేసి కాపాడుకుంటున్నవారు ... మత సామరస్యంతో మానవత్వమే మా మతం అని చాటి చెప్తున్న వారు ఎందరో....

స్నేహ పరిమళాలు

సంతోష్ సింగ్ (మధ్య ప్రదేశ్), రజాక్ ఖాన్ తివారి (ఛత్తీస్ గఢ్) స్నేహం మతాలకు, ప్రాంతాలకు, ఆస్తులకు-అంతస్తులకు అతీతమైనది. 'ఒకరు హిందూ. మరొకరు ముస్లిం. మీ మధ్య అంత ప్రాణ స్నేహమేంటని' ఎవరైనా అడిగినా... నవ్వేవారే కాని మారు సమాధానమిచ్చే వారు కాదు. అర్థం చేసుకోవాలే గానీ ఆ నవ్వులోనే ఎన్నో జవాబులు ధ్వనించేవి. అలాంటి మిత్రద్వయం మధ్య ప్రాణాంతక గుండె జబ్బు చిచ్చు పెట్టినప్పుడు రజాక్ తీసుకున్న నిర్ణయం ఎప్పటికీ నిలిచే వుంటుంది. రెండు మాసాల కిందట గుండె జబ్బుతో సంతోష్ చనిపోయినప్పుడు భార్య, కుమార్తె ఒంటరి పక్షుల య్యారు. అతని అంత్యక్రియలకు సైతం డబ్బు లేక దిక్కుతోచని స్థితిలో వున్నప్పుడు ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు రజాక్. తను ముస్లిం అయినప్పటికీ ... హిందూ మత సంప్రదాయ పద్ధతుల్లో మిత్రుడిని కడసారి సాగనంపి నిజమైన నేస్తంగా పలువురి ప్రశంసలు అందుకున్నాడు.



బెయిల్‌తో భరోసా

వాళ్లు మొత్తం పదిహేను మంది. ఉత్తరప్రదేశ్‌లోని బరేలి కారాగారంలో ఊచలు లెక్కిస్తున్నారు. టికెట్ లేకుండా ప్రయాణించడమే వారు చేసిన నేరం. అందుకుగాను జైలుశిక్ష అనుభవిస్తున్నారు. మామూలుగా అయితే కోర్టులో హాజరయ్యాక బెయిల్ మీద బయటికి రావొచ్చు. అందుకు కావాల్సిన డబ్బు లేక... అయినవారికి దూరంగా దొంగలు...హంతకుల మధ్య మగ్గుతున్నారు. జైలు అధికారుల ద్వారా ఈ విషయం తెలుసుకొన్న కొందరు ముస్లిం యువకులు చలించిపోయారు. యాభై వేల రూపాయలు సేకరించి ... పదిహేను మంది హిందూ యువకులను బెయిల్‌పై బైటకి తీసుకొచ్చారు. సంతోషంగా బైటికి వచ్చిన వారిని మనసారా హత్తుకొని ... దారి ఖర్చులకు డబ్బులిచ్చి మరీ సాగనంపారు.

ప్రార్థనాలయాలకు చేయూత

బీహార్‌లో జరిగిందీ అరుదైన ఘటన. చంపారన్ జిల్లాలోని కేసారియాలో కనీ వినీ ఎరుగని రీతిలో ... 200 ఎకరాల్లో 500 కోట్ల రూపాయలతో భారీ ఆలయాన్ని నిర్మించాలన్నది గ్రామస్తుల కోరిక. అయితే ఆలయం కట్టాలనుకున్న భూమి పూర్తిగా హిందువులది కాదు. మూడు డజన్ల మంది ముస్లింలూ వున్నారు. వారు మనస్ఫూర్తిగా అంగీకరించి తమ పొలాలను ఇవ్వకపోతే ఆ ఆలయం పని కానే కాదు. పెద్ద మనసుతో వారంతా అంగీకరించడంతో గుడి కల సాకారం కాబోతోంది. ఈసారి తమ వంతు అన్నట్టు కర్నాటకలోని హిందువులు కొందరు ముస్లిం సోదరుల దర్గా మరమ్మతు చేయించుకోవడానికి అవసరమైన పైకం సమకూర్చారు. వందేళ్లనాటి ఆ మసీదు వర్షాల కారణంగా తీవ్రంగా పాడైపోయింది. విషయం తెలిసిన హిందువులు కొందరు మసీదు మరమ్మతు కోసం తమ తాహతకు తగ్గ సాయం చేశారు.

పరస్పర సహకారం

ఓ వైపు గణేష్ ఊరేగింపు. అంతా రణగొణ ధ్వనులతో జరుగుతుంది. మరో వైపు నమాజ్. ప్రశాంత వాతావరణంలో చేస్తారు. రెండూ ఒకేసారి జరగాల్సి వస్తే... చెప్పేదేముంది! ఏమైనా జరగొచ్చు. అలాంటిది ముంబైలో గత ఏడాది... ఇరువురూ సామరస్యంతో ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రశాంతంగా పూజలు, ప్రార్థనలు జరుపుకు న్నారు. ఆ శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ పూర్తయ్యే వరకు గణేష్ ఊరేగింపు చేస్తున్న వారు నిశ్శబ్దంగా నిలబడిపోయారు. దాంతో రెండు గ్రూపుల వారి కళ్ల ల్లోనూ కృతజ్ఞతా భావం మెదిలింది.

ప్రాణదాతా సుఖీభవ

బీహార్‌లోని ముజఫర్‌పూర్ మత ఘర్షణల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ సమయంలో ముస్లింలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగెత్తారు. ఆ పరిస్థితుల్లో అప్పటి వరకు తినుబండారాలను ఇచ్చిపుచ్చుకున్న వారే కాని వారయ్యారు. కలసి కబుర్లు చెప్పుకున్నవారే శత్రువులయ్యారు. ఆ సమయంలో హిందూ మహిళ షయల్ దేవి మానవత్వాన్ని ప్రదర్శించింది. 5 వేల మంది అజీజ్‌పూర్ గ్రామంపై దాడి చేసినప్పుడు .... తన కుటీరంలో పదిమంది ముస్లింలకు ఆశ్రయం ఇచ్చి ప్రాణాలు కాపాడింది. ముస్లింలు ఎక్కడ వున్నా వెంటాడి మరీ చంపేస్తున్న ఉన్మాదపూరిత హిందూ యువతను తన ఇంటి మీదికి రాకుండా అడ్డుపడి వారిని ఆ గండం నుంచి బైటపడేసిందా వీర నారి. రెండేళ్ల కిందటే ఆమె భర్త చనిపోయాడు. కూలి నాలి చేసుకుంటూ తన ఇద్దరు కుమార్తెలను సాకుతున్న ఆమె గొప్ప సందేశమే ఇస్తోంది. 'నేను మానవత్వమనే మతాన్ని పాటించాను. చాలా కాలంగా కలిసి జీవిస్తున్న ఇరుగుపొరుగును నా కళ్ల ఎదుటే చంపేస్తుంటే నేనెలా చూస్తూ ఊరుకుంటాను!' అనడుగుతోందా చదువులేని పట్టభద్రురాలు.

గో మాంసం తిన్నాడన్న అనుమానంతో మహ్మద్ అఖ్లాక్ అనే వ్యక్తిని మతోన్మాదం తలకెక్కిన కొందరు హత్య చేయడం గురించి చదివి యావత్ ప్రపంచమే తెల్లబోయింది. ఉత్తర ప్రదేశ్‌లోని దాద్రి ఇందుకు వేదిక అయ్యింది. ఆ సందర్భంలో సమీప గ్రామాల్లోని ముస్లిం కుటుంబాలకు రక్షణ కరవైంది. వెంటాడి హతమార్చే హిందూ మతోన్మాదుల నుంచి తమను తాము కాపాడుకోవడం కష్టమైంది. సరిగ్గా అప్పుడు మూడు హిందూ కుటుంబాలు 70 మంది ముస్లింలను దాచి పెట్టి కాపాడి అక్కడి నుంచి తప్పించారు. ఆ తర్వాత వారి ఇళ్లను కూడా నాశనం చేయకుండా అడ్డుకున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో కాశ్మీర్ యాత్రలకెళ్లిన కొందరికి స్థానిక ముస్లింలు ప్రాణభిక్ష పెట్టారనుకోవచ్చు. పంజాబ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వీరు వేసుకున్న గుడారాలు వరదల కారణంగా కొట్టుకుపోయాయి. వస్తువులదీ అదే పరిస్థితి. ఆఖరికి మనుషులు సైతం ఉధృతంగా వచ్చిపడిన వరద నీటిలో కొట్టుకుపోయారు. సరిగ్గా ఆ సమయంలో సైన్యం రంగంలోకి దిగి సాయం చేసినా... స్థానిక ముస్లిం కుటుంబాలు చేసిన మేలు మాత్రం మర్చిపోలేమన్నది యాత్రికుల మాట. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రతిభా దేవి తమ పదహారేళ్ల కుమారుణ్ణి కాపాడినందుకు వారికి జీవితాంతం రుణపడి వుంటానంటోంది. ✦

షయల్ దేవి

అమ్మానాన్నలయ్యారు



అయుష్, ప్రధానతో షహన్వాజ్ కుటుంబం

ఆయుష్, ప్రధాన దయాళ్ కవల పిల్లలు. అమ్మ ఢిల్లీలో ఎయిర్ హోస్టెస్, నాన్న పైలెట్. అయితే ఈ చిన్నారులను అంతలోనే దురదృష్టం వెన్నాడుతుందని... అమ్మానాన్నల్ని ఒకేసారి దూరం చేస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. అయినవారు పిల్లల ఆస్తిపాస్తులను ఎలా సొంతం చేసుకోవాలా అని ఆలోచిస్తున్న తరుణంలో తండ్రి స్నేహితుడి రూపంలో వారికి ఆపన్నహస్తం అందింది. బంధువులంతా పిల్లల బాగోగుల కన్నా వారి వెనక వున్న ఆస్తి మీదే ఆసక్తి ఎక్కువ కనబరచడంతో వారి తాతయ్య ప్రవీణ్ దయాళ్ తమ కుమారుడి నేస్తాన్ని కలిసి మనసులోని మాట చెప్పాడు. తను ముస్లిం మతస్తుడిని కావడం వల్ల అందుకు బంధు వర్గం నుంచి వ్యతిరేకత వస్తుందేమోనన్న సందేహాన్ని వెలిబుచ్చాడు షహన్వాజ్. పెద్దాయన మద్దతు పూర్తిగా వుండడంతో ... న్యాయస్థానం అనుమతితో పిల్లలను దత్తత తీసుకుని అక్కున చేర్చుకున్నాడు.

లక్నోలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. టీ అమ్ముకుని బతికే ఐకూ అనే వ్యక్తిని ఓ ముస్లిం పెంచి పెద్దచేశాడు. వీరి మధ్య మత ప్రస్తావనే రాలేదు. మార్పిడీ జరగలేదు. ఐకూ కూడా అనాథ పిల్లవాడైన అజీజ్‌ను చూసి జాలిపడి... పెంచి పెద్దచేశాడు. తర్వాత తన కన్నతల్లి కనిపించినా... ఐకూను విడిచి వెళ్లలేక అతనితోనే వుండిపోయాడు.

అక్కినేనితో...

నవ్వుల రాజు

హీరోలతో సమానంగా రేలంగి పారితోషకం తీసుకుంటున్న రోజులవి. రమణారెడ్డి, సి.యస్.ఆర్, చదలవాడ కుటుంబరావు, అంజిగాడు (బాలకృష్ణ) వున్నా రేలంగి స్థానాన్ని బీట్ చేసే వారెవరూ లేరప్పట్లో. ఆ సమయంలో వెండితెర మీద ఆవిర్భవించాడు ఓ నటుడు. ఆయన నవ్వినా, ఏడ్చినా, మాట్లాడినా, మాట్లాడకపోయినా ఒకటే నవ్వులు ఆయన కనిపిస్తే చాలు నవ్వులు నావలా సాగిపోయేవి. ఏ సినిమా అయినా అతడే. పుణ్యమూర్తుల అప్పలరాజు సినీ ప్రపంచానికి తెలిసిన రాజబాబు.

బాల్యంలో అప్పలరాజు

గోదావరి గడ్డ రాజమహేంద్రవరంలో పుణ్యమూర్తుల ఉమామహేశ్వరరావు, రమణమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఆ ముగ్గురిలో పెద్దవాడు అప్పలరాజు. ఇంటర్మీడియట్ చదువు ముగించి టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసుకుని స్కూలు టీచర్‌గా పనిచేస్తూండేవాడు. 'కుక్కపిల్ల దొరికింది' 'నాలుగిళ్లచావిడ'. 'ఎవరికి పిచ్చిలాంటి' నాటకాల్లో ప్రధాన పాత్రలు వేసి నవ్వుల పంట పండించేవాడు. రంగస్థల ప్రదర్శన ఇస్తుండగా చూసిన డా॥గరికపాటి రాజారావు రాజబాబుని దృష్టిలో పెట్టుకొని సినిమాల్లో ప్రయత్నించు మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రోత్సహించాడు. చిట్టిబాబు రంగస్థలం మీద అప్పుడే నాటకాలు ప్రారంభించాడు.

రాజబాబు భగీరథ ప్రయత్నం

చెన్నై మహానగరానికి రావడమైతే వచ్చాడు గాని ఎవరు ఆదరిస్తారు ! పగలంతా వేషాల కోసం ప్రయత్నం ... రాత్రిళ్ళు తెలిసినచోట తలదాచుకోవడం ఇదే నిత్య కృత్యం.. ఆకలేసి కడుపు దహించుకుపోతే కుళాయి నీళ్ళతో కడుపు నింపుకోవడం పరిపాటి అయిపోయింది. చెన్నైలో రంగరాజపురం తెలుగు వాళ్ళున్న చోటు. అక్కడే ఎక్కువ సమయం గడిపేవాడు. అంజి, పద్మనాభంల దగ్గర కబుర్లు చెప్తూ నవ్వించేవాడు. పద్మనాభం "నువ్వు సామాన్యుడివి కాదురా నువ్విక్కడ ఉండవలసిన వాడివి కాదు! అంటూ నవ్వుతూ ఆకాశం చూపించేవాడు. మొదట్లో సమాజం, భీష్మ, కులగోత్రాలు, పరువు ప్రతిష్ట, నవరాత్రి, బంగారు పిచుక, పరమానందయ్య శిష్యుల కథ చిత్రాలతో మంచిపేరు వచ్చింది. ఆ చిత్రంలో పద్మనాభం, అల్లురామలింగయ్యలతో సమానంగా పేరు వచ్చింది. ముఖంలో పలికించే భావాలకు తెలుగు ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారు. తమిళంలో నగేష్ .. తెలుగులో రాజబాబు అనే పేరువచ్చింది.

హీరోగా రాజబాబు

కమెడియన్ చక్రం తిప్పుతున్న రోజులు రాజబాబు రామప్రభ వరుసగా వందరోజుల పాటు ఇంటిముఖం పట్టకుండా రోజుకి నాలుగు షిఫ్టులు చొప్పున పనిచేస్తున్న రోజులు. కారు ప్రయాణంలోనే విశ్రాంతి మేకప్ చేసుకుంటూ కునికిపాట్లు పడటం . సెట్‌లో ఫ్లడ్ లైట్స్ వెలుతురులో ఒకసారి రిహార్సల్స్ చేసి రెండోసారి టేక్ ఓకె చేసేయ్యడం వీరి అలవాటు. అటువంటి సమయంలో ప్రతాప్ ఆర్ట్స్ రాఘవ నిర్మాణ సంస్థ నుండి పిలుపొచ్చింది. 'తాత-మనవడు' సినిమాలో హీరో పాత్ర. ప్రధాన పాత్రలో ఎస్వీరంగారావు నటిస్తున్నారు. మిగతా అంజలీదేవి, సత్యనారాయణ, రాజ సులోచన ముఖ్యంగా అప్పటికే హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో వున్న విజయ నిర్మల రాజబాబు సరసన నటించాలి. దాసరి దర్శకుడు. ఈ సినిమా ప్రారంభం నాటికి అందరూ పెదవి విరిచిన వారే. సినిమా విడుదలయ్యింది. దాసరి దర్శకత్వంలోనే ఎవరికి వారే యమునా తీరే, రోజా రమణి హీరోయిన్‌గా సినిమా చేశారు. అదీ సూపర్ హిట్. రాజబాబు

సినిమాల జైత్రయాత్ర ప్రారంభమయ్యింది.

రాజబాబు జైత్రయాత్ర

ఏ నిర్మాణ సంస్థలోనైనా కథ పుట్టక ముందే హీరో, హీరోయిన్లను నిర్ణయించక ముందే రాజబాబు, రామ ప్రభల జంటని నిర్ణయించేవారు. అదీ రాజబాబు స్టార్‌డమ్. గూఢచారి116, బందిపోటు దొంగలు, ఏకవీర, కథానాయకుడు, కోడలు దిద్దిన కాపురం, బొమ్మా–బొరుసా, ప్రేమ్‌నగర్, శ్రీమంతుడు, బడిపంతులు, ఇద్దరు అమ్మాయిలు, మిత్రబంధం, అందాల రాముడు ఇందులోనే రమణ సృష్టి అప్పుల అప్పారావు పాత్ర పేలిపోయింది. శారద, అల్లూరి సీతారామరాజు, జీవన జ్యోతి, సోగ్గాడు, జమీందారు గారి అమ్మాయి, మహాకవి క్షేత్రయ్య, అడవి రాముడు, కార్తీక దీపం, బంగారమ్మ ఇలా ఆరు వందల పై చిలుకు చిత్రాలు సునాయాసంగా చేయగలిగాడు.

సున్నిత హృదయం

చెన్నై టి.నగరు నెంబరు వన్ రాజబాబు ఇంటిముందు పదికి తక్కువగాకుండా టూరిస్టు బస్సులు ఆగేవి. అందరితో ప్రేమ పూర్వక పలకరింపులు ఇంట్లోనే. వినాయకుడి గుడి ఆ గుడిలో నిత్య పూజలు చూడ్డానికి మిత్రులూ, శ్రేయోభిలాషులు ఎంగిలిపడి వెళ్లవలసిందే. చదువులు, పెళ్లి , రోగాలూ, అన్నింటికీ రాజబాబే దిక్కే. అడిగిన వారికి లేదనుకుండా సహాయం చెయ్యడం రాజబాబు అలవాటు. తన చేతిలో లేకపోతే కంపెనీకి కబురు చేసి ప్రొడక్షను మేనేజరుతో డబ్బు తెప్పించి ఇచ్చేవాడు. 'మనిషి రోడ్డున పడ్డాడు' చిత్రం స్వీయ నిర్మాణం పక్కదారులు తొక్కింది. ఇల్లు ఒళ్ళు గుల్లయ్యింది. ఇచ్చే చేతికి పుచ్చుకొనే చేతికి తప్ప మూడో కంటికి వ్యవహారం తెలియనిచ్చేవాడు కాదు. అదే అతని జీవితంలో అశనిపాతంలా పరిణమించింది. రాజబాబు రోడ్డున పడ్డాడు. అన్న ప్రచారం బయల్దేరింది. నిజానికి ఆస్తులు ఉన్నాయి. రాజబాబు సున్నితమైన మనస్సుతో ప్రతిచిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకునేవాడు. తనకు వేలు, లక్షలు బాకీ వున్న నిర్మాత దర్శకులు మొహం చాటేసుకొని తిరగడం చూసి భరించలేకపోయేవాడు. తన మెదడుని తొలిచేసే ఆలోచనలకి అక్షర రూపం ఇచ్చేవాడు.

మంచితనానికి మరో రూపం

పద్మనాభం 'శ్రీరామకథ' సినిమా చేస్తున్న సమయంలో నలభై వేల రూపాయలు బాకీ పడ్డాడు. రాజబాబు డిస్టర్బ్‌డ్‌గా వున్నాడు. పాండిబజారులో రోహిణి లాడ్జీలో ఉండేవాడు. ఒక రోజు పద్మనాభం దగ్గరకెళ్ళి విషయం చెప్పాడు సగం చచ్చిపోయానని. పద్మనాభం వెంటనే బీరువాలో ప్రమీల (పద్మనాభం మూడవ భార్య) పేరు మీద ఉన్న డాక్యుమెంట్స్ ఇచ్చి ఎక్కడైనా కొదువ పెట్టి అప్పులు తీర్చుకోమని చెప్పాడు. అంతే బోరుమని ఏడ్చేసి అన్నయ్యా! ఒక ఆడపిల్ల డబ్బింగులు చెప్పి కొనుక్కున్న స్థలం కుదువ పెట్టాలా? అంత పాపం చెయ్యలేనని పద్మనాభం మాట వినకుండా ఏడుస్తూ వచ్చేశాడు. అదీ రాజబాబు మంచితనానికి తార్కాణం!

సావిత్రికి ఘన సన్మానం

అప్పటికి సావిత్రిని దాదాపు అందరూ మరిచిపోయారు. అటువంటి సమయంలో సావిత్రికి ఘన సన్మానం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. నిజానికి అప్పటికే సినిమాలు తగ్గుముఖం పట్టాయి. మొదట సావిత్రి ఒప్పుకోలేదు. పసిపిల్లాడిలా భోరున ఏడుస్తూ నోరారా అక్కా అనిపిలిచేవాడు. తను తమ్ముడూ అని పిలిచేది. ఇరవై రోజుల వ్యవధిలో టి.నగరు మహల్‌లో ఘనంగా సన్మానం చేశాడు. ఆ సన్మానానికి జెమినీని కూడా పిలిచాడు. ఆయన వచ్చారు. అప్పుడు రాజబాబు చెప్పిన మాటలు ఎప్పటికీ మరిచిపోలేం! "అక్క సావిత్రి దేవత! నన్ను తమ్ముడు అని పిలవడం నా పూర్వజన్మ సుకృతం. ఎవరు పదికాలాలు బతుకుతారు? ఎంతకాలం బతుకుతారు? బతకవలసింది మంచితనం. రేపు నేను పోవచ్చు. లేదా సావిత్రక్క పోవచ్చు అప్పుడే ఘనంగా జరిగిన సంతాప సభలూ సంస్మరణ సభలు, సేద తీరుస్తాయా? అందుకే బతికున్నప్పుడు చేసేది కలకాలం గుర్తుండి పోతుంది. కాదు గుండెల్లో వుండిపోతుంది". అన్నాడు. అలాగే మరుసటి సంవత్సరం సావిత్రి, ఆ తర్వాత 14 ఫిబ్రవరి 1983లో రాజబాబు మరణించారు.

- ఇమంది రామారావు

ఎన్టీఆర్‌తో...

ఇందిరతో...

సెట్‌లో...

ఓ తాత... 34 ఏళ్ల కవర్

"కూరగాయలు ఎలా పట్టుకెళ్లాలయ్యా? ఓ కవర్ ఇవ్వు.." అని అమ్మలు, అయ్యలు అనడం, "ప్రతి ఒక్కళ్లకీ కవర్‌లు... రోజూ అంటే ఎలాగండీ. నిన్న ఇచ్చిందో.. ఓ బుట్టో

తెచ్చుకునే దానికి.." అని వ్యాపారి గొణగడం మామూలే. ఇంటిని ఓ ప్లాస్టిక్ కవర్ల చెత్త బుట్ట చేసేస్తారు చాలా మంది. ఇలాంటి లక్షల ఇళ్ల వల్లే పర్యావరణానికి పెద్ద తంటా అవుతోందని ఎంత చెప్పి ఏం లాభం. వేల్స్‌కు చెందిన మార్క్ మెక్ కాస్కీ అనే తాత అలా కాదు. గత 34 ఏళ్లుగా ఒకే కవర్‌ను సరుకులు, కూరగాయలు తెచ్చుకునేందుకు మళ్లీ మళ్లీ వాడుతున్నాడు. 1981 నుంచి ఇప్పటి వరకూ సుమారు 2000 సార్లు ఈ కవర్‌తోనే షాపింగ్ చేశాడు. ఈ మధ్య తాతను చూడటానికి వెళ్లిన మనవరాలు ఈ కవర్ సంగతి తెలుసుకుని ఆశ్చర్యపోయింది. వెంటనే దాన్ని ఓ ఫొటో తీసి ఫేస్‌బుక్‌లో పెట్టింది. తాత సెలబ్రెటీ కాకపోయినా ఇలాగైనా పర్యావరణ పరిరక్షణకు అంబాసిడర్ అయినా చాలంటున్నాడు. బయటకు వెళ్లేపుడు ఎందుకైనా అవసరపడుద్దని ఆ కవరును జాగ్రత్తగా చిన్నగా మడిచి జేబులో పెట్టుకుంటాడు.

పొయ్యి కార్లు

'కొన్నేళ్ల తర్వాత పెట్రోల్ ఇక ఉండదట, ధరలూ పెరిగి పోతున్నాయి..' అని యూగిని చెర్నిగోవ్ అతడి మిత్రులు ముచ్చట్లు పెట్టుకున్నారు. ఆ మాటల్లోనే పొయ్యి గుర్తొచ్చింది ఆ ఉక్రెయిన్ ఫిజిక్స్ టీచర్‌కు. ఔనూ! దాన్ని కారుకు తగిలించి ఇంధనంగా వంట చెరకు వాడేస్తే బాగుంటుంది కదా అనుకున్నాడు. నెట్టంతా వెతికి రెండో ప్రపంచ యుద్ధం నాటికే ఇలా పొయ్యితో నడిపే కార్లు ఉపయోగించారని చూసి ఆశ్చర్యపోయాడు. కొన్ని రోజులు బాగా చదివేసి ప్రయోగాలు చేసేసి ఆ పాత సాంకేతికతపై పట్టు సాధించాడు. కారు డిక్కీలో ఓ కట్టెల పొయ్యి, క్యానిస్టర్ జత చేసి ఇంజిన్‌కు కనెక్ట్ చేశాడు. కారు నడవడం మొదలెట్టేసింది. మంచి మల్‌బరీ చెక్క వాడితే గంటకు 100 కి.మీ. వేగాన్ని కూడా టచ్ చేస్తోందట. డబ్బు బాగా ఆదా అవుతోందట. ఇదంతా బానే ఉంది గానీ వీణ్ని చూసి ఇంకొందరు అలా వేలాది మంది వాడేస్తే చెట్ల నరికివేత అనేక రెట్లు పెరిగి పర్యావరణం మరింత దెబ్బతినడం ఖాయం.

వింత లోకం

రెండు జీవితాలు

'అంత వయసులోను భలే ఉన్నాడే...' అని మార్క్ రీయేని అనని వారుండరు. ఒకప్పుడు అతడో న్యూయార్క్ మోడల్, ఇపుడో ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్. ఎత్తుపల్లాలనేవి గుండె ఈసీజీ రిపోర్ట్‌లా ఉంటాయి ఆ రంగంలో. మార్క్ పరిస్థితి మరీను. పని దొరికితే మిలియనీర్ల మధ్య షాంపెయిన్ తాగుతూ, లేకుంటే రోడ్డు పక్కన పస్తులతో గడుపుతూ. రోజూ రెండు జీవితాలు గడిపే అతడిని చూసి ఏం అనాలో తెలీక జాలిపడితే.. అతడు మాత్రం చాలా క్యాజువల్‌గా నవ్వేస్తూ నిద్ర పోవడానికి రోడ్డు పక్కన బ్లాంకెట్ పరుస్తాడు. ఉదయం లేవగానే జిమ్‌కు వెళ్లి అక్కడ ఉన్న వాష్‌రూమ్‌లో స్నానం కానిచ్చి, బట్టలు ఉతుక్కుని హ్యాండ్ డ్రయర్ల దగ్గర వాటిని ఆరేసి నీటుగా రెడీ అవుతాడు. కెఫేలో కూర్చుని ఏం ఆర్డరివ్వకున్నా హుందాగా కనిపిస్తూ ల్యాప్‌టాప్‌లో ఫొటోలు ఎడిట్ చేసుకుంటాడు. ఎవరైనా మోడలింగ్ మేనేజర్ తారసపడగానే స్టైయిల్‌గా వెళ్లి మాట కలుపుతాడు. ఏదైనా ప్రాజెక్ట్ కబురందగానే పార్కులోని మొక్కల గుబుర్లలో జాగ్రత్తగా దాచిన కెమెరా, ల్యాప్‌టాప్‌లను బయటకు తీసి ఫొటోషూట్‌కు వెళతాడు. పని లేకుంటే పస్తులుంటాడు. ఒంటికి ఓ టార్పాలిన్ పట్టా చుట్టుకుని, ముఖం ఎవరికీ కనిపించకుండా మేనేజ్ చేయడం ఓ తమాషా అంటాడు. అతడి కష్టాలెన్నున్నా వెనక్కు తగ్గింది లేదు. తండ్రి చనిపోయాక డబ్బంతా కోల్పోయి వీధిన పడ్డ మార్క్ ఆరేళ్ల పాటు స్నేహితుని ఫ్లాట్ రూఫ్‌టాప్‌లో ముడుచుకొని నిద్రలు కానిచ్చేవాడు. పదుల అంతస్తుల బిల్డింగ్‌పైకి ఎమర్జెన్సీ స్టైయిర్‌కేస్‌పై ఎక్కేవాడు. కంచె సరిగ్గా దూకలేకపోతే అంతెత్తు నుంచి పడి చనిపోయే ప్రమాదం ఉండేది. ఎవరైనా గమనించి దొంగ అంటారేమో అని భయపడుతూనే గడిపేవాడు. భారీ వర్షాల కాలంలో మెరుపులు, పిడుగులు దడ పుట్టించేవి కూడా. అతడి జీవితంపై 'హోమ్ లెస్' అనే డాక్యుమెంటరీ వచ్చింది. పరిస్థితులు కాస్త మెరుగుపడుతున్నాయి.



ట్రేడ్ సెంటర్ గ్రామం

చైనాలోని శాంగ్జీ ప్రావిన్స్‌లోని నాన్లియ గ్రామానికో ప్రత్యేకత ఉంది. అక్కడ ఏ ఇద్దరు చేరినా షేర్ మార్కెట్ల గురించి తెగ మాట్లాడేస్తుంటారు. ఏ నలుగురు మూగినా ట్రెండ్‌ను అంచనా కడుతుంటారు. రైతులు, సరుకుల దుకాణదారులు అందరూ ట్రేడింగ్ చేసేస్తుంటారు. ఊరి పెద్ద ఇంటిలో ఏర్పాటు చేసిన చిన్న కంప్యూటర్ యూనిట్‌కు మధ్యాహ్నానికి కల్లా పొలం పనులు

ముగించుకుని చేరిపోతారు. కొందరైతే ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా స్టాక్ మార్కెట్ సమాచారాన్ని తెలుసుకుంటుంటారు. పార్ట్ టైమ్‌గా ట్రేడింగ్ చేస్తున్నా చాలా సీరియస్ విశ్లేషణలు సాగిపోతుంటాయి. పక్కనే ఉన్న ఓ టౌన్ వల్ల ఇది అంటుకుందని ఒక్కొక్కరిగా మొదలై మొత్తం గ్రామమంతా షేర్ల ఆటలో పడిపోయింది. తొలుత బాగానే లాభాలు రావడంతో ఊరంతా కళకళలాడిపోయేది కానీ ఈ మధ్య పరిస్థితులు తారుమారు కావడంతో అప్పుల పాలైపోతున్నారు ఊరి జనం.

చెట్టుకో తిట్టు

కవిత్వమ్

నా దారి కడ్డంగ నిలిచింది
నా కంటే ఎత్తుగా ఎదిగింది
నా ముందె పురుడు పోసింది
అవనియంతా ఆకుపచ్చదనంతో నింపింది
ఆగుఆగుమన్నా
మౌనంగా ఆక్రమించింది
అందుకే దాని నడ్డుతొలగించుకోవాలనుకొన్నా
పదునైన గొడ్డలెత్తి
కరుకైన రంపాలు బెట్టి
మదమెక్కిన కండలతో
అడ్డంగ నరికి వేసా
అట్టహాసంగా కాంక్రీటు వనాలు నాటా
ఎప్పుడు ప్రతిఘటించనిది
ఎన్నడు పగ తీర్చుకోనిది
ఏ మాటా మంతీ లేనిది
తన గోడు విన్పించలేనిది
అమాయకంగా తలవంచేదని
మూగ జీవే గదా యని
అడ్డంగ నరికివేసా...
ఆనందోత్సాహాలు జరుపుకొన్నా
నాకంటే ముందు పుట్టి
ప్రతికూల వాతావరణాన్ని తట్టుకొని
ప్రతివారికి చేదోడు వాదోడుగ వుంటు
గాలినిచ్చి, నీడనిచ్చి కాయనిచ్చి గరవనిచ్చి
దాన కర్ణుడివోలె విర్రవీగుతుంది
నరికి నోడికైనా నీడనిస్తూ
దుర్మార్గులకైనా వానలనిస్తూ
కుత్సితులకైనా కడుపు నింపేస్తోంది
అందుకే దాన్ని అడ్డు తొలిగించుకొన్నా
ముక్కలు ముక్కలు నరికి
హరితాన్ని తుక్కు చేసా
విషవాయువు ఆహ్వానించా
నరికిన ప్రతిసారీ
పోటుగాడేల్లె
గొడ్డులెత్తిన ప్రతి తడవ విప్లవ యోధుడల్లే,
చిగుళ్ళ పిడికిళ్ళు బిగిస్తుంది
నీవు నన్నేమి చేయలేవని
ఎగతాళి చేసినట్లుంది.. మారాకు వేసింది
అణగదొక్కినప్పుడల్లా
నింగినేలను నీరును నేస్తంగ చేసుకొని
శిరసెత్తుతుంది. ప్రతిహరితం వేస్తుంది
సస్యశ్యామలం పంచుతుంది
విశ్వమంతా మరులు గొల్పుతుంది
అందుకే అదంటే నాకు చెడ్డ చిరాకు
దాని పేరు చెట్టు.. నాపేరు మనిషి
సారీ... మహిషి!

- లక్కరాజు శ్రీనివాసరావు

సెల్: 9849166951

మానవ కళ్యాణం ఒక్కటే

ఇప్పుడే విశ్వంలోకి ప్రవేశిస్తూ
వొకరు
విశ్వంలోంచి నిష్క్రమిస్తూ
వొకరు
మధ్యలో జగన్నాటక
సూత్రధారులుగా మనం
నలభై సంవత్సరాల నాడు
మనం విద్యార్థులం
చదివిన చోటే యిప్పుడు
కలసిన వృద్ధులం
నాటి అనుభూతుల్ని
నెమరేసుకుంటున్న ఆప్తులం
కొన్ని ఫలిత కేశాలు
కేశాలు రాలిన ఎర్రెర్రని
నల్లనల్లని బుర్రలు
గూళ్ళను మరిపిస్తున్న బుగ్గలు
స్వరం పెగలని గొంతులు
నడకను తిరస్కరిస్తున్న కాళ్ళు
చూపును అద్దాలకు
అప్పగించిన కళ్ళు
ఎవరికి వారు వివరిస్తే గాని
వివరాలు తెలియని రూపాలు
ఒకరు చుక్కల్ని తాకిన భవన
నిర్మాత
ఒకరు ఢిల్లీ దాకా పాకిన
రాజకీయ నాయకుడు
ఒకరు ఖండిత శిరస్సును
అతికించిన వైద్య నిపుణుడు
ఒకరు తిరుమలేశునికి
అప్పులిచ్చే కుబేరుడు!
ఆనాడు పాఠాలు పక్కకు పెట్టి
ఆటల్లో మేటిగా రాణించి
కళాశాలను అందనంత ఎత్తున
నిల్పిన అర్జునరావు
అంతర్జాతీయ ఫుట్‌బాల్
పోటీలో గోల్ చేసి
అభినందనలు అందుకుంటూ
హఠాత్తుగా గుండె ఆగటం
మనకు గుర్తు!
నటనే జీవిత పరమావధిగా
చదువుకు విరామం ప్రకటించి
సినీ ఇంద్రజాలంలో దూరి
ప్రభవించక వికసించక
కటిక దారిద్ర్యంలో మగ్గి
మరణించిన మురారి మనకు
గుర్తు
కట్నాలపై కత్తిగట్టి కక్షగట్టి
అశేష జనాన్ని ఆకట్టుకుని
ఆకర్షించి
విద్యార్థి దశలో ఉద్యమించిన
యువకేసరి
కోట్ల కట్నానికి తాళిగట్టి
నోట్లు లెక్కిస్తూ కనుమూసిన
ఆదిత్యుడు మనకు గుర్తు !
ఎక్కడ కవిత్వం వినిపించినా
అక్కడ కనిపించిన
ఆనందరావు
అర్ధాంగి ఆరోగ్యం విషమించి
ఆర్థిక సాయం కోరి నా చేతులు
పట్టుకుంటే
మూడు పూటల్ని రెండు
పూటలకు కుదించినా
చాలీ చాలని నా చేతులు
మిత్రుడు విష్ణుమూర్తి చేతుల్ని
ఆసరా అడిగాయి
పట్టుకున్న చేతులు
పట్టుజారిపోగా
ఆనందుడి చేతుల్లో అర్ధాంగి
అలాగే రాలిపోవడం నాకు
గుర్తు
నాది చెప్పే వర్గమూ
మీది వినే వర్గమూ కాదు
మానవ కళ్యాణం ఒక్కటే
మనందరి మార్గం !

- అడిగోపుల వెంకటరత్నమ్

సెల్: 9848252946

వ్యవహారం

- పి. శ్రీనివాస్‌గౌడ్



సుబ్బారావు టీచర్‌గా పెద్దగా సంపాదించిందేం లేదు. తోటి టీచర్లు చిట్టీ పాటలని, స్థలాలు, పొలాలని తెగ సంపాదించేస్తుంటే...సుబ్బారావు మాత్రం ఆ ధైర్యం చెయ్యలేకపోయాడు. పిల్లల పాఠాలు గాలికొదిలి సొంత వ్యాపారాల మీద తిరగడానికి మనసొప్పలేదు. ఒకేపు డబ్బు సంపాదించాలని మనసు పీకుతున్నా ఇంట్లో భార్య డబ్బు సంపాదించమని పీక్కు తినకపోవడంతో ఆ పని చేయలేదు. ఇప్పుడు రిటైరై ... కాసిని డబ్బులు చేతిలో పడి... తీరిగ్గా ఇంట్లో వుంటున్న సుబ్బారావులో కొత్త ఆశలు మోసులు వేసాయి. ఆ ఉత్సాహంలో వెంటనే మంచి స్థలం ఉంటే చూడమని ఓ బ్రోకర్‌ని పురమాయించాడు. అతను వెంటనే స్థలం చూపించాడు. రోడ్డు పక్క పది సెంట్ల స్థలం. నలు చదరపు బిట్టు. కొద్దిగా ఊరికి దూరం. చుట్టు అక్కడక్కడా ఇళ్లు ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. తన అనుభవ జ్ఞానంతో సుబ్బారావుకి ఈ స్థలం నచ్చిందని గ్రహించాడు బ్రోకరు. వేడిమీద ఉన్నప్పుడే ఇంకో దెబ్బ వెయ్యాలి కాబట్టి...

"సుబ్బారావు గారూ.. రోడ్డు పక్క బిట్టు... సెంటు ముప్పై వేలకి ఎవడయ్యా ఇచ్చేది..నిన్న గాక మొన్నే... ఆ ఎదురుబిట్టు నలభై వేలు పోసి కొన్నారు." అన్నాడు. రోడ్డుకు ఎదురుగా వున్న స్థలం చూపించి. సుబ్బారావు 'అవునా' అని ఆలోచించసాగాడు. కష్టమర్ ఎక్కువగా ఆలోచిస్తే 'కమీషన్ లక్ష్మి' అలిగి ముఖం ముడుచుకుని వెళ్లిపోతుందని తెలుసుకున్న వాడే బ్రోకరన్నవాడు కాబట్టే "ఇదిగో సుబ్బారావు గారు.. మీరు కాదంటే చెప్పండి.. అవతల ఇంకో పార్టీ రెడీగా వుంది. రోడ్డు మీది బిట్టు.. పోతే మళ్లీ రాదు... అంతగయితే ...మళ్లీ నేనే అమ్మిస్తాన్లే... అన్నాడు లౌక్యంగా..

"సర్లే కానీండి... స్థలం ఎవరిదన్నారు? కాయితాలూ... రేటూ.."

"ఆకలి ఆనందరావని...మనోడేలే...కాయితాల ఇబ్బందేం లేదు. రేటు గురించి మీరింకేం మాట్లాడకండి. సాయంత్రం అగ్రిమెంటు రాయించేద్దామా మరి.." బ్రోకర్‌లో ఉత్సాహం వరదనీరులా తన్నుకొచ్చింది. సుబ్బారావు మళ్లీ స్థలం వైపొకసారి చూసాడు. రోడ్డు మీద స్థలం. ఊరికి దగ్గర ఇప్పుడిప్పుడే ఇళ్లు పడుతున్నాయి. ఒకటి రెండు సంవత్సరాలు దాటితే రేటు రెండుమూడింతలవ్వచ్చు. సుబ్బారావు మనసులో ఆశ ఒళ్లు విరుచుకుంది. అదేం బయటకు కనపడనీయకుండా మనసులో లెక్కలు కట్టుకుంటూ "సరే..కానీయండి" అన్నాడు సుబ్బారావు సాధ్యమైనంత నిర్లిప్తంగా.

• • •

కరణం కనకారావు ముందు తల పట్టుకుని కూర్చున్నాడు సుబ్బారావు. కనకారావు తన కళ్లద్దాల్లోంచి సుబ్బారావునే చూస్తున్నాడు...వంకరగా సుబ్బారావు తల పైకెత్తి "కరణం గారూ మీరే చెప్పండి.. అగ్రిమెంట్లో గడువు దాటితే 'రూపాయి వడ్డీ' అని మీరే కదా రాసారు. మరి ఆ ఆనందరావేంటండీ... స్థలాల రేట్లు పెరిగాయని 'వడ్డీ ఎవడిక్కావాలి..లక్ష ఎక్స్‌ట్రా' ఇమ్మంటాడు.. ఇదేం న్యాయం... మీరే చెప్పండి" అన్నాడు పీలగా.

"అదేనండి వీళ్లతో వచ్చింది.. వట్టి డబ్బు మనుషులండీ.. అగ్రిమెంట్లు వీళ్లకొక లెఖ్ఖా. ఇట్టాంటివి నా సర్వీసులో ఎన్ని చూసాను.. అయినా మీరు డబ్బులు చేతిలో లేకుండా ఎట్టా దిగారండీ..?

"డబ్బు లేకపోతే నేనెందుకు దిగుతానండీ.. ఇదంతా నా కొడుకు నిర్వాకం... ఇదిగో వెంటనే ఇచ్చేస్తానంటూ డబ్బంతా తీస్కెళ్లి ఇళ్లు కట్టుకున్నాడు. డబ్బు అడుగుతావుంటే సమయానికి డబ్బందలేదని... ఇస్తానన్నవాళ్లు ఇయ్యలేదని..ఇదిగో ఇట్టా నన్ను నలుగుర్లో నామర్దా పట్టిస్తున్నాడు."

కరణం కనకారావు సుబ్బారావు అసహనాన్ని అంచనా వేసాడు."ఇదిగో సుబ్బారావు గారూ.. ఒఖ్ఖ ఐదువేలు నా మొకాన కొట్టారంటే ...స్వయంగా నేనే వెళ్లి విషయం చక్కబెట్టుకు వచ్చేస్తానండి."

"పనవ్వాలి గానీ.. పంతులు గారూ.. డబ్బుల్దేముందండి...ముందెళ్లి విషయం మాట్లాడిరండీ..."

"అదిగో... అట్టన్నారు బావుంది. ఇంతకీ మీరెంతలో వున్నట్టూ..?

"ముప్పై వేలకు పైన ఒక్క పైసా ఇవ్వనండీ..'

సుబ్బారావుకి మనస్సంతా చికాగ్గా వుంది. పుండు మీద కారం చల్లినట్లు ఈ విషయం బైటకు పొక్కి, కనపడిన ప్రతి పరిచయస్తుడు 'అట్టంటగా' 'ఇట్టంటగా' అని సానుభూతి చూపిస్తున్నారు. వాళ్ల మాటలు వింటా వుంటే ఎంత తల తిక్కోడివిరా' అని వాళ్లంటన్నట్టు అనిపించి, ఒళ్లంతా మండిపోతోంది సుబ్బారావుకి. ఎవరిమీదో తెలియని కోపంతో మాటి మాటికి పళ్లునూరుకుంటున్నాడు. ఇంటి దగ్గర ఇంక కాలు నిలవక కరణం ఇంటికి బయలుదేరాడు.

కరణం అప్పుడే భోంచేసి వచ్చి పడక్కుర్చీలో నడుం వాల్చాడు. సుబ్బారావుని చూసి, కష్టం మీద లేచి, నోట్లో తాంబూలం ఊసి వచ్చాడు.

"ఆ ఆనందరావు లక్షకి ఒక్క పైసా తగ్గడటండీ.. జగమొండిలా మాట్టాడుతున్నాడు. అరె..పెద్ద ముండావాడ్ని ...స్వయంగా నేనొచ్చి చెప్పినా వినడే". పళ్లలో ఇరుక్కున్న తమలపాకు తునకలు వేలితో తీసుకుంటూ నింపాదిగా అన్నాడు కనకారావు.

ఆ మాట విన్న సుబ్బారావుకి నోట మాట రాలేదు. "అయితే వాడ్ని కోర్టుకీడ్చి అక్కడే తేల్చుకుంటాన్లెండి.." అన్నాడు బింకంగా.

"కొంపదీసి ఆ పని గాని చేసేరు. పూర్తిగా ఇరుక్కుంటారు. మీకు తెలియని ఇంకొక లిటిగేషనుందిక్కడ..."

"మళ్లా అదేంటండి..? ఆదుర్దా పడ్డాడు సుబ్బారావు.

"ఆ పది సెంట్ల స్థలం ఇద్దరన్నదమ్ములది. ఇరువురూ భాగ పంపిణీలు చేసుకోలేదు. ఇప్పుడు ఆనందరావు అన్న గోవిందరావు రోడ్డు వైపు బిట్టు నాదని ఫిటింగు పెట్టాడండీ.."

సుబ్బారావు గుండె ఒక్కసారి ఆగి మళ్లీ కొట్టుకుంది. 'దేవుడా' అంటూ ఒక్కసారిగా కింద కూలబడ్డాడు.

"అయినా మీరొక తప్పు చేసారు సుమండీ... ఆ గోవిందరావుతో ఒక్కమాట అని వుండాల్సిందండీ.."

"అగ్రిమెంటు రాసేటప్పుడు మీరి విషయం ఎందుకు చెప్పలేదండీ..?" సుబ్బారావుకి ఉక్రోషంలో ఆక్రోశం కలిసిపోయింది.

"మీరూ మీరూ మాట్టాడుకుని.. నాలాంటి వాడ్ని ఉపేక్షిస్తే ఇలాగే అవుతుందండీ.. కరణం మాటకి మాట అంటించాడు. కరణం ధోరణి చూస్తుంటే లోపాయికారిగా వాళ్ల దగ్గర డబ్బు గుంజి వుంటాడనిపించింది సుబ్బారావుకి. ఇక కరణంతో పని అయ్యేటట్టు లేదని నీర్సంగా పైకి లేచాడు 'మళ్ళొస్తా'నంటూ...

"ఎంత ఇచ్చినా... పుచ్చుకున్నా.. అందులో నాది ఇరవై పర్సంటయ్యా... ముందుగానే చెబుతున్నా.. ఈ వ్యవహారంలో తేడా రాకూడదు." ఎంత కరాఖండిగా అన్నాడు మార్తాండం సుబ్బారావుతో.

మార్తాండం ఊళ్లో చిన్నపాటి రాజకీయ నాయకుడు. మాజీ సర్పంచి. సెటిల్‌మెంట్లు చేస్తాడన్న పేరుంది. సుబ్బారావుకి కొడుకు డబ్బులు తిరిగిస్తాడన్న ఆశ కోడలు పెడసరం వల్ల అడుగంటింది. స్థలం కొనడం మాట అటుంచి, ఆనందరావుకి ఇచ్చిన డబ్బులు వెనక్కి తెచ్చుకునే మార్గం కనపడక, ఏం చేయాలో పాలుపోక చివరికి మార్తాండాన్ని ఆశ్రయించాడు సుబ్బారావు.

మార్తాండం తన మనుషుల్ని పంపి ఆనందరావుని పిలిపించాడు. ఆనందరావు గోవిందరావునీ, తన తరుపు పెద్ద మనుషుల్ని తీసుకువచ్చి కూర్చున్నాడు. అటూ ఇటూ పెద్దమనుషుల మధ్య అటూ ఇటూ మాటలు పెద్ద ఎత్తునే దొర్లినియ్యి.

'ఇస్తే స్థలం ఇవ్వు. లేదంటే ఐదు లక్షలివ్వు' అని ఆనందరావుకి తీర్మానించాడు మార్తాండం. పెద్ద మనుషుల్లో కలకలం రేగింది. గోల గోలగా ఎవరేం మాట్టాడుతున్నారో అర్థం కాకుండా కీసర బాసరయింది. పరిస్థితి గందరగోళంగా మారేసరికి మార్తాండం అవతలపార్టీ పెద్దమనిషి పెద్దిరెడ్డిని పక్కకు లాక్కెళ్లి, చెవిలో సులక సూత్రం ఊదాడు. 'ఆ' అని నోరు తెరిచిన పెద్దిరెడ్డిని నోరు మూయించి 'అవునయ్యా' అని తీసుకొచ్చాడు.

"చూడయ్యా...సమయానికి డబ్బులు కట్టక సుబ్బారావూ..కడతానన్న డబ్బులు చాలవని ఆనందరావూ.. ఇద్దరూ మాట తప్పారు కాబట్టి సుబ్బారావు డబ్బులుకి ఒక లక్షేసి నువ్వే ఇచ్చేయవోయ్.. ఆనందరావ్" అన్నాడు. పెద్దిరెడ్డి పెద్దరికంగా "ఆ ఎందుకూ.. అదే రేటుకి స్థలమే ఇచ్చేస్తా. ఎనకమాల తీసుకోమను. రోడ్డుమీద బిట్టు నాది" అన్నాడు గోవిందరావు మెలిక పెట్టి.

"ఎనికమాలకి దారేదిరా..? అది కరెక్ట్ కాదులేరా... సుబ్బారావు డబ్బులు ఆయనకు ఇచ్చేయడమే ధర్మం " అన్నాడు పెద్దిరెడ్డి చుట్ట వెలిగించుకుంటా.దాంతో ఆనందరావు గయ్యన లేచి "నేనొప్పుకో"నని విసురుగా వెళ్లిపోయాడు. పెద్దమనుషులు ఒకళ్ల మొకం ఒకళ్లు చూసుకొని మళ్లీ రేపు పిలిపిద్దాం లే' అని ఎవరికి వాళ్లు సర్దుకున్నారు.

అందరికంటే చివరిగా నీరసంగా లేచాడు సుబ్బారావు.

"సుబ్బారావు.. నువ్వేం ఇదవ్వమాక... వ్యవహారం రేపు సెటిల్ చేద్దాంలే.. ముందో వెయ్యింటే కొట్టు అన్నట్టు ఆ పెద్దిరెడ్డి ముఖం మీద కూడా ఎంతో కొంత కొట్టు ..మేటరు తొందరగా సెటిల్ అయిద్ది.." అని మార్తాండం డబ్బుల కోసం చెయ్యి చాపాడు. వెయ్యి వదిలిచ్చుకుని, వడలిపోయిన వంకాయి మాదిరిగా తిరుగు ముఖం పట్టాడు సుబ్బారావు. ఆ రోజు నుంచి రెండు మూడు సార్లు పెద్దమనుషులు పంచాయితీకి కూర్చున్న ప్రతిసారి.. వెయ్యి వెయ్యి వదిలాయి.

పట్టు వదలని విక్రమార్కుడిలా మార్తాండం చుట్టూ పదిసార్లు తిరిగినా మరో పదివేలు చమురు వదిలింది కాని పనిమాత్రం దరిదాపుల్లో అయ్యేటట్టు కనిపించలేదు సుబ్బారావుకి.

కాలం గడుస్తా వుంది. ఎట్టయితే అట్టయిందని ఆనందరావుకి ఓ కోర్టు నోటీసు తగిలించి ఊరుకున్నాడు సుబ్బారావు. ఆనందరావు దగ్గర్నించి ఉలుకు పలుకు లేకపోవటంతో, ఇంకా కిర్రెక్కి కోర్టుకు తిరుగుతున్నాడు. ఆనందరావు వాయిదాలు కోరుతూ ఉన్నాడు.

ఈ లోపు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారిపోయినయి, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, ఆంధ్రారాష్ట్రాలుగా విడిపోయింది. దీంతో ఆంధ్రరాష్ట్ర రాజధాని ప్రాంతంలో స్థలాల, పొలాల రేట్లకు రెక్కలు వచ్చినయి. సుబ్బారావు కొన్న స్థలానికి కూడా రేటు అమాంతం పెరిగిపోయింది. అడుగంటిపోయిన సుబ్బారావు ఆశలు మళ్లీ ఉత్సాహంతో రివ్వుమని పైకి లేచినయ్. ఇంతలో ఆనందరావు పాత ఒప్పందానికి ఒప్పుకొని డబ్బులిస్తానని పెద్దిరెడ్డి చేత కబురంపాడు. 'అంతగైతే ఇంకో రెండు లక్షలు నేనే ఇస్తా నాకిచ్చేయండి' అని తిరిగి వర్తమానం పంపాడు సుబ్బారావు.

"ఏవండి.. ఎందుకండి మనకీ పాడు పీడ? ఆ డబ్బులేవో తీసుకొని ఈ వెధవ స్థలం ఈ వెధవకే వదిలెయవొచ్చు కదండీ.. మనకెందుకండీ ఈ వ్యవహారాలు.." అంది భద్రావతి



సుబ్బారావుతో.

“వుండవే భద్రా .. ఇప్పటిదాకా ప్రతోడు మనల్ని వెర్రిపప్పుల్ని చూసినట్టు చూసారు. ఇప్పుడు చూడు... రాజధాని దెబ్బకి రేట్లు ఝూమ్మని పైకి లేచాయి. ఇప్పుడు ఎక్కిరించినోళ్లు.. రేపు నెత్తికెక్కించుకుంటారు భద్రా.. పోతే పోనీ రెండు లక్షలు.. అంతగైతే అప్పుచేద్దాం. ఈ స్థలం కొని మంచి రేటుకి అమ్ముకుందామే..” అన్నాడు సుబ్బారావు.

“అది కాదండి. నిన్న మీరు లేనప్పుడు కొడుకూ, కోడలు వచ్చెళ్లారు. ఆ స్థలానికి అవసరమైతే డబ్బు సర్దుతామంటున్నారండీ..’ అంది భద్రావతి నీళ్లు నములుతూ..

“ఏందే వాళ్లిచ్చేది.. ఇస్తామన్నది ఇవ్వలేదు గానీ, ఇప్పుడు రేట్లు పెరుగుతున్నాయనేసరికి పరిగెత్తుకొచ్చారా.. ఏం నేనంత గతి లేని వాడ్నా? వాణ్ని అడుక్కోవాలా? ఏం వద్దులే.. మళ్లీ మేం చేసాం చెందాం అని గొప్పలు..” సుబ్బారావు మనసులో కోడలు మెదులుతూ వుంటే చేతులు ఊపుతూ ఈసడించాడు.

భద్రావతి ఇంకేం మాట్లాడలేదు. సుబ్బారావుకి ఈ స్థలం తప్ప వెనుకా ముందు ఏం కనపడలేదు.

చెప్పినట్టే రెండు లక్షలు ఎక్కువిచ్చి స్థలం రిజిష్టర్ చేయించుకున్నాడు సుబ్బారావు. ఆనందరావు ఏ మాత్రం బాధ లేకుండా అన్నను కూడా తీసుకుని సంతకం చేయించడం సుబ్బారావుకి ఆశ్చర్యమనిపించింది. “డబ్బు మహిమ” అనుకున్నాడు దర్పంగా...

‘మీ భూమి- మీ ఇంటికి ‘కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన పథకం. భూమి యజమాని పేర్లు కొలతలు హద్దులు, కాగితాలు, ఇలాంటి వాటిల్లో ఏమన్నా తేడాలు తగాదాలు వుంటే పరిష్కరించే కార్యక్రమం అది. అందులో భాగంగా ప్రభుత్వ లెక్కల్లో.. అడంగల్‌లో తన పేరు నమోదు చేయించుకుందామని సుబ్బారావు రిజిష్టరయిన స్థలం కాగితాలు తీసుకొని రెవిన్యూ ఆఫీసుకు వెళ్లాడు.

కాయితాల్లో సర్వే నెంబర్లు తనిఖీ చేశాడు. ఆర్.ఐ. “ఇది గవినివారి పాలెం కదా? ” అని అడిగాడు ఆర్.ఐ. “అవును ...ఏంటి సార్” అన్నాడు సుబ్బారావు.

“ఈ సర్వే నెంబరు మొత్తం ఐదున్నర ఎకరాలు.. ఎసైన్డ్‌లో పడిందయ్యా..కొత్త లిస్టులు వచ్చినియ్యి” అన్నాడు ఆర్.ఐ. ఒక్క నిమిషం ఏమీ అర్థం కాలేదు సుబ్బారావుకి. అర్థం అయ్యాక కళ్ల చుట్టూ చీకట్లు కమ్ముకున్నాయి. సుబ్బారావు కళ్లు తెరిచే సరికి ఇంట్లో మంచం మీద ఉన్నాడు. భద్రావతి ఆందోళనగా చూస్తు ఉంది. కొడుకు ముభావంగా చూస్తు ఉన్నాడు. కోడలు ‘బాగా జరిగిందన్నట్టు’ చూస్తూ “డబ్బులుంటే సరా... వ్యవహారం తెలియద్దూ” అంటోంది. సుబ్బారావుకి మళ్లీ మగత కమ్మింది.

“ఏమండి..”

“ఊ”

“ఎవరో మార్తాండం అటండీ..”

“ఏమంటున్నాడే...’ సుబ్బారావు గొంతు తడారి పోయింది.

“నాతో వ్యవహారం కాదు... నా డబ్బుల వ్యవహారం తేల్చకపోతే...సుబ్బారావు వ్యవహారం తేలుస్తా అంటున్నాడండి”

దెబ్బకి సుబ్బారావు నిద్ర మత్తు ఎటో ఎగిరిపోయింది. భద్రావతి వంక, ఆమె చేతిలో సెల్‌ఫోన్ వంక పిచ్చి మొకమేసుకొని పిచ్చిచూపులు చూస్తు ఉండిపోయాడు.

✦

ఆహ్వానం

కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండ కూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధపడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక,హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

నవ్వుల్ - పువ్వుల్

కుక్క



భర్త: ఈ మధ్య అందరూ నన్ను కుక్కలా చూస్తున్నారు.

భార్య: అవేం మాటలు! అలా మిమ్మల్ని మీరు తక్కువగా భావించకూడదు.

భర్త: తక్కువ కాదు. మన చంటిగాడు కూడా నన్ను అలానే చూస్తున్నాడు. నాకు చచ్చిపోవాలని అనిపిస్తూ ఉంటుంది.

భార్య: అబ్బా, ఊరికే అలా మొరక్కండి, నలుగురూ వింటారు.

నిర్లక్ష్యం

జంబులింగం: డాక్టర్... మీరే నాకు సహాయం చెయ్యాలి. నేను మాట్లాడుతుంటే ఎవ్వరూ నా మాట వినట్లేదు. నా మాటంటే ఎవ్వరికీ లెక్క లేకుండా పోతుంది. ఏం చెయ్యాలో తెలియడం లేదు.

డాక్టర్: నెక్ట్స్, ప్లీజ్.....

బాధ్యత

ఒక వ్యక్తి హాస్పటల్ బెడ్ మీద చావు బతుకుల మధ్య తన భార్యని పిలిచి ఇలా చెబుతాడు.

నువ్వు కూకట్‌పల్లిలో ఉన్న పది అపార్ట్‌మెంట్స్ తీసుకో..

పెద్ద కొడుకుని పిలిచి ‘నువ్వు దిల్‌సుఖ్‌నగర్‌లోని షాపింగ్ మాల్స్, ఒక గుడి తీసుకో.

రెండో కొడుకుతో ‘నువ్వు మెహదీపట్నంలోని రెండు టెంపుల్స్ తీసుకో.

కూతుర్ని పిలిచి ‘నువ్వు శ్రీ నగర్‌లోని స్వీట్ షాప్స్ తీసుకో అని చెప్పి చచ్చిపోయాడు.

ఇంతలో ఇవన్నీ పక్కనే ఉండి వింటున్న నర్స్ ‘మీ వారు చాలా గొప్పవారు కదా.పోతూ పోతూ బోలెడు ఆస్తి సంపాదించడమే కాకుండా బాధ్యతగా పంచిపెట్టి మరీ పోయారు’ అంది.

‘ఆస్తా ...పాడా... మాది పాల వ్యాపారం. పాల ఖాతాలు అప్ప చెప్పి పోయాడు’ అని వాపోయింది భార్య.

సగ్గుబియ్యం బూరెలు

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం-1/4 కేజీ, మైదా-100 గ్రాములు, బెల్లం-1/4 కేజీ, యాలకులు-10, కొబ్బరి తురుము-రెండు స్పూన్లు, పాలు-ఒక్క గ్లాసు, నూనె- 1/4 కేజీ

తయారీ

సగ్గుబియ్యం పాలల్లో మూడు గంటలు నానబెట్టండి. యాలకులు మెత్తగా పొడి కొట్టండి. బెల్లం కూడా సన్నగా తురమండి. మైదాపిండిని జల్లించండి. వీటన్నింటిని సగ్గుబియ్యంలో వేయించి కొబ్బరి తురుము కూడా వేసి బాగా కలపండి. పొయ్యిమీద బాణలి పెట్టి నూనెపోసి కాగనివ్వండి. సగ్గుబియ్యం మిశ్రమాన్ని నూనెలో బూరెల్లా వేసి వేయించండి. ఇవి కొద్దిగా సాగినట్లుగా వున్నా కూడా తింటుంటే తమాషాగా ఉంటాయి.

పునుగులు

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం-1/2 కప్పు, మైదా-1/4 కప్పు, పెరుగు- ఒక కప్పు, పెద్ద ఉల్లిపాయ - ఒకటి, పచ్చి మిరపకాయలు-నాలుగు, ఉప్పు, నూనె-సరిపడినంత

తయారీ

పెరుగులో పావుకప్పు నీళ్ళు, అర కప్పు సగ్గుబియ్యం పోసి ఆరు గంటలు నానబెట్టండి. ఉల్లిపాయ, పచ్చి మిరపకాయలను సన్నటి ముక్కలుగా కోయండి. నానిన సగ్గుబియ్యంలో మైదా, ఉప్పు, ఉల్లిపాయ, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి బాగా కలపండి. బాణాలిలో నూనె పోసి కాగిన తర్వాత సగ్గుబియ్యం మిశ్రమాన్ని చిన్న చిన్న వుండలుగా నూనెలో వేసి దోరగా వేయించండి. వేడి వేడిగా చట్నీతో అల్లం చట్నీతో కానీ తింటే రుచిగా ఉంటుంది.

సగ్గుబియ్యం తాలిపీట్

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం-1 1/2 కప్పులు, ఉడికించిన ఆలుగడ్డ-ఒకటి, పచ్చి మిరపకాయలు-రెండు, పల్లీల పొడి-1/2 కప్పు, జీలకర్ర-1/2 టీ స్పూను, ఉప్పు, నూనె, కొత్తిమీర, పుదీనా -సరిపడినంత

తయారీ

సగ్గుబియ్యం మునిగేలా నీళ్ళు పోసి మూడు గంటలు నానబెట్టండి. కొత్తిమీర పుదీనా కడిగి సన్నగా తరమండి. ఉడికించిన ఆలుగడ్డ, జీలకర్ర, పచ్చి మిరపకాయ ముక్కలు, కొత్తిమీర, పుదీనా తురుము, పల్లీల పొడి, ఉప్పు, నానిన సగ్గుబియ్యంలో వేసి బాగా కలపండి. నీళ్ళు పోయకూడదు. నాన్‌స్టిక్ పాన్ పెట్టి వేడిచేయండి. సగ్గుబియ్యం మిశ్రమాన్ని కావలసిన సైజులో వుండలు చేయండి. తడి చేయి చేసుకొని సగ్గుబియ్యం ముద్దను అప్పడంలా వత్తి పాన్‌లో వేసి రెండు స్పూన్లు నూనె వేసి రెండు వైపులా బ్రౌన్ స్పాట్స్ వచ్చే వరకు కాల్చండి. వర్షాకాలపు సాయంత్రం వేళ వేడివేడిగా చట్నీతో కానీ, అవకాయతో కాని తింటే రుచిగా ఉంటుంది.

వడలు

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం-రెండు కప్పులు, ఆలుగడ్డ-ఒకటి, పచ్చి మిరపకాయలు-నాలుగు, కొత్తిమీర తురుము-ఒక కప్పు, జీలకర్ర- ఒక టీ స్పూన్, నూనె, ఉప్పు-సరిపడినంత, పల్లీలపొడి-ఒక కప్పు

తయారీ

సగ్గుబియ్యంలో సరిపడినన్ని నీళ్ళుపోసి రాత్రి నానబెట్టండి. పచ్చి మిరపకాయలు మెత్తగా గ్రైండ్ చేయండి. ఉడికించిన ఆలుగడ్డ, పల్లీలపొడి, జీలకర్ర, కొత్తిమీర తురుము సరిపడినంత ఉప్పు వేసి ముద్దలా చేయండి. చిన్న చిన్న ఉండలు చేయండి. బాణాలిలో నూనె వేడిచేసి సగ్గుబియ్యం వుండలు వేసి వేయించండి.

కత్తిరించి అతికించండి

బుజ్జి పక్షి పిల్ల తల్లి బొమ్మను ఓ అల్లరి పిల్లాడు కత్తిరించేశాడు. మీరు మంచి పిల్లలు కదా. జాగ్రత్తగా ఏ ముక్క ఎక్కడ అతికిస్తే పక్షి పిల్ల తల్లి తయారవుతుందో చూడండే.



దారి చూపండి



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా నటిని, టీవీ యాంకర్‌ని . ఇది నా చిన్ననాటి ఫోటో...నేనెవరో గుర్తించండి.

[illegible]

పదాలు పూరించండి

ఈ చిత్రంలోని బొమ్మల ఎదురుగా వాటి పేర్లను ఇచ్చాం. అయితే వాటి చివరి అక్షరాలు మాత్రమే కనిపిస్తాయి. మొదటి అక్షరాలను మీరే రాయాలి.

_ _ail

_ail

_ail

_ail

_ail

జవాబు: snail, nail, mail, sail, pail

పప్పీలు ఎన్ని?

ఇక్కడ బోలెడన్ని జంతువులు ఆడుకుంటున్నాయి. వాటిలో కుక్కపిల్లలు, కుక్కలు ఎన్ని వున్నాయో లెక్కించి చెప్పండి చూద్దాం.

గుర్తు పట్టారా?



ఈ చిత్రాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఇందులో మనుషులు, జంతువులు కనిపిస్తాయి. మనుషులు ఎందరో, జంతువులు ఎన్నో గుర్తించండి.

విమానాల అన్నయ్య

మీకో అన్న గురించి చెప్పాలి. ఎనిమిదేళ్లకే డిగ్రీ చేసేసిన అతడి పేరు మోషే కై. ఊరేమో అమెరికాలోని కాలిఫోర్నియా నగరం. ఇప్పుడు 17 ఏళ్లు వచ్చేశాయిలెండి. మరి ఇప్పుడెందుకు చెబుతున్నామంటే ఈ మధ్య నాసా అతడికి ఉద్యోగం ఇచ్చింది. అదే అంతరిక్షంలోకి రాకెట్లు పంపించే అమెరికా వాళ్ల సంస్థ. చేయాల్సిన పనేంటో తెలుసా విమానాలు, మనిషి లేకుండా తిరిగే డ్రోన్లనే బుల్లి విమానాలు ఆకాశంలో తిరిగేటపుడు ఒకదానితో ఒకటి ఢీకొనకుండా ప్రోగ్రామ్ చేయాలి. మోషేకే ఎందుకాపని అప్పజెప్పారో తెలుసా. అతడికి విమానాలు నడపడం వచ్చు. కంప్యూటర్ క్రిప్టోగ్రఫీ అనే ప్రోగ్రామింగ్ కూడా బాగా వచ్చు. ఇక లెక్కల గురించి చెప్పేదేముంది. గణగణా లెక్కలు చేసేస్తాడు. ఇంకా చాలా విశేషాలున్నాయి మోషే గురించి. 8 ఏళ్లకే డిగ్రీ చేసిన అమెరికాలోని మొదటి బాలుడు అయిన మోషే తర్వాత ఏడాదికే తన జీవిత గాథ రాసేశాడు. తాను ఎలా ఆ వయసు కల్లా డిగ్రీ చేయగలిగింది. తల్లిదండ్రులు ఎలా ప్రేరణనిచ్చింది. ఎంతగా పుస్తకాలతో కుస్తీ పడింది వివరంగా, ఫన్నీగా రాశాడు. ఇష్టంగా చదివితే చాలా ఈజీ అనే సలహా కూడా ఇస్తాడు. మోషేకు చిన్నప్పటి నుంచి విమానాలంటే చాలా ఇష్టం. దానికి తగ్గట్టు వాళ్ల అమ్మానాన్న కూడా సపోర్ట్ చేశారు. మోషేకు కేవలం పుస్తక జ్ఞానం ఉందనుకోకండి. అతడో మంచి మార్షల్ ఆర్టిస్ట్ కూడా. ఎన్నో పతకాల్ని కూడా గెలిచాడు. 15వ ఏట లెక్కల్లో మరో డిగ్రీ చేసిన మోషే, ఆ తర్వాత అంతరిక్ష భౌతిక శాస్త్రంలో మాస్టర్స్‌లో చేరాడు. ఈలోగా నాసా పిలవడంతో ఉద్యోగానికి వెళ్లిపోయాడు. కంప్యూటర్‌పై పట్టు సాధించింది మధ్య మధ్యలో చదువుతూనే. మోషే మరో పుస్తకం కూడా రాశాడు. స్కూళ్లలో తోటి విద్యార్థుల్ని ఏడిపించే చెడ్డోళ్ల వల్ల ఎలా చిన్నారులు ఇబ్బంది పడుతుంటారో, అది ఎంత తప్పో అంటూ ఓ కథలా పుస్తకం రాశాడు. తన జీవిత గాథలా ఈ పుస్తకం కూడా బాగా అమ్ముడుపోయింది. ఇంకా బోలెడు గొప్ప విషయాలున్నాయి మోషే గురించి. అయితే వాటిన్నంటికన్నా మీకో విషయం చెప్పాలి. అతడికి ఏదో ప్రత్యేకత లేదు మీ అందరిలాగానే అతనూను. కానీ, చదువంటే బాగా ఇష్టపడటం. పాఠాల్ని శ్రద్ధగా వినడం. హోం వర్కుల్ని వదలకుండా చేసేయడం. రాని పాఠం గురించి మళ్లీ మళ్లీ టీచర్‌నో, తల్లిదండ్రుల్నో అడిగి తెలుసుకోవడం. తన ఇష్టమైన సబ్జెక్టు, రంగం గురించి పెద్దోళ్లకు చెప్పి వారి సహాయం తీసుకోవడం, టీవీని విపరీతంగా చూడకపోవడం, స్కూల్‌కు ఎక్కువగా సెలవు పెట్టకపోవడం వంటి చిన్న చిన్న వాటితోనే ఇదంతా సాధించగలిగాడు. మీకు కూడా ఓ సలహా ఇస్తున్నాడు. తనతో కానీ, పక్కవారితో కానీ అస్సలు పోల్చుకోకుండా కేవలం ప్రేరణ (ఇన్స్పిరేషన్)ను మాత్రమే తీసుకుని, తమకు తాము తక్కువగా భావించకుండా ఆత్మ విశ్వాసంతో, దేన్నైనా సాధించగలమనే నమ్మకంతో అడుగు ముందుకు వేయమంటున్నాడు. నిన్నటి కన్నా ఈ రోజు ఎక్కువ ఏం నేర్చుకున్నారు. రేపటికి ఇంకా ఏం మెరుగు అవబోతున్నారనే దానిపైనే దృష్టి పెట్టాలని అంటాడు. వింటారు కదూ పిల్లలూ. చేస్తారు కూడాను కదా.

◆ ప్రత్యేకం

రాజసం అంటే ప్యాలెస్‌లు, వింటేజీ కార్లు, సేవకులు, అజమాయిషీయేనా! మరి ఈ రాజు గుడిసెలో ఉన్నాడు. రిక్షాలో తిరిగాడు. పాత్రలు తోముకున్నాడు. తండ్రిలా ప్రజల్ని ఆదుకున్నాడు. అందుకేనేమో ఈ మధ్యే కనుమూసిన ఆ చిట్టచివరి భారతీయ రాజుకు ఘనంగా నివాళులు అర్పించింది ఒడిశాలోని తిగిరియా గ్రామం. ఈ రాజు-పేద జీవితం అందరికీ సాధ్యం కాకపోవచ్చు.

రాజు -పేద ఒక్కరే!

బ్రజ్ రాజ్ క్షత్రియ బీరబర చామ్‌పాటి సింగ్ మహాపాత్ర ఆయన పేరు. మరి రాజు పేరంటే అంత సింపుల్‌గా ఉండదు. పేరు సింపుల్‌గా లేకపోయినా ఆయన బతికింది మాత్రం చాలా చాలా సింపుల్‌గా. ఎంత సింపుల్‌గా అంటే ప్యాలెస్‌ను బాలికల పాఠశాలగా మార్చే షరతుపై ఇచ్చేసి మకాం గుడిసెకు మార్చాడు. వింటేజీ కార్లు అమ్మేస్తూ గ్రామానికి అక్కరకు వచ్చాడు. రాజ్యాలు, రాజులు పోయిన భారత్‌లో రాజకీయ నాయకులుగా ప్రభను కాపాడుకుంటున్న చాలామందిలా కాకుండా ఓ పూరి పెద్దకు కాస్త ఎక్కువగా జనాల్లో తిరిగాడంతే. రాజు ప్రజల్ని ఓట్లు అడుక్కోడు అని ఆయన అన్న మాట వెనుక రాజసం తాలూకు పొగరు కనిపించినట్టున్నా ఆ మాటకు అర్థం వేరు. జన హృదయాల్లో స్థానం సంపాదించాలి గానీ ఓ సీట్ కాదు అని. పోయిన మనిషి గురించి మంచిగా చెప్పుకోవడం అలవాటే గానీ మరీ ఇంత పొగడ్తలు అవసరమా అంటే. ఈ మాటలన్నీ చెబుతోంది ఊరి వారే. సర్వం కోల్పోయిన వారి రాజుకు అన్నీ తామై చివరి రోజుల్లో బాగోగులు చూసుకుంది వారే. చివరకు కట్టె కాలేందుకు తలా పది రూపాయలు చందాలేసుకుంది వారే. ఆ పది రూపాయలే ఎందుకంటే అది రాజు గారి చివరి కోరిక. ఆయన కోరకుండానే ఓ స్మృతి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారిపుడు. బ్రజ్‌రాజ్ మహాపాత్ర అని మీడియా షార్ట్‌గా పిలుచుకుంటే ... ఊరి వారేమో ఆజా (తండ్రి అని అర్థం) అని భావోద్వేగాలు ఒలికిస్తూ మాట్లాడతారు.

తిగిరియా సంస్థానానికి చివరి రాజు బ్రజ్‌రాజ్. 1943లో రాజైన ఆయన నాలుగేళ్ల తర్వాత భారత రిపబ్లిక్‌లో విలీనం చేశాడు. అప్పటికీ ఆయన మహా వైభవంగా బతికాడు. ఇరవైల్లో వయసుండటంతో జోరుగా వింటేజీ కార్లలో తిరిగాడు. ఖరీదైన సెలవుల్ని గడిపాడు. అటు ఇటుగా ఓ ప్లేబోయ్ జీవితాన్ని దగ్గరగా చూశాడు. ఆ తర్వాత ఆయన రాణి రసమణి దేవిని వివాహమాడి 6 పిల్లలకు తండ్రి కూడా అయ్యాడు. కారణాలేవైతేనేం భార్య పిల్లల్ని తీసుకుని వేరుగా వెళ్లిపోయింది. ఆ ఒంటరితనాన్ని భరించలేక మద్యానికి బానిసయ్యాడు. ఆ తర్వాత కోలుకున్నా పూర్వ రాజ వైభవ జీవితంపై విరక్తి వచ్చిందేమో అన్నింటినీ వదిలిపెట్టాడు. భువనేశ్వర్‌కు 60 కి.మీ.ల దూరంలో ఉండే తిగిరియా సంస్థానానికి చాలా చరిత్రే ఉంది. క్రీ.శ. 1246లో రాజస్థాన్‌కు చెందిన మహాపాత్రలు ఈ ప్రాంతాన్ని కైవసం చేసుకుని అప్పటి నుంచి పాలించారు. దట్టమైన అడవులు, కొండ ప్రాంతమైన తిగిరియాపై ఆ తర్వాత ఎవరూ కాలుపెట్టలేకపోయారు. శత్రు దుర్భేద్యమైన ఈ సంస్థానంతో పొరుగు రాజులు మంచి సంబంధాలే కలిగి ఉండేవారు. పూరీకి చెందిన గజపతి రాజులు జగన్నాథ ఆలయంలోని దేవతా మూర్తుల విగ్రహాల్ని, మూల విరాట్‌లను దండయాత్రలు, దాడుల సందర్భాల్లో తిగిరియాకు రహస్యంగా పంపి మహాపాత్రల సాయంతో భద్రపరచగలిగారు. సంస్థానంలోని ఓ నదీ పరివాహక గ్రామంలో 12 ఏళ్లపాటు దాచిన వాటిని తిరిగి అక్కడి ప్రసన్న మణి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఒడిషీ నృత్యానికి సంబంధించిన 'అభినయ దర్పణ్ ప్రకాశన్' అనే గ్రంథం, సాంప్రదాయక యుద్ధ కళపై రాసిన 'బీర సర్వస్వ'ను ప్రపంచానికి అందించింది. ఇదే కాదు ఆ సంస్థానం చరిత్ర చాలానే ఉంది. అలాంటి సంస్థానంలో చివరి రాజుగా ప్రకటించబడిన బ్రజ్ రాజ్ మహాపాత్ర ప్రజాతంత్ర భారత్ కోసం ఒరియాలోని 25 సంస్థానాలతో పాటు తన సంస్థానాన్ని విలీనం చేశాడు. అప్పటికి ఆయన దగ్గర 4 ఎకరాల ప్యాలెస్, 30 మంది సేవకులు, ఏనుగులు, గుర్రాలు 56 వాహనాలతో దర్పంగానే ఉండేవాడు. రాణి దూరమవడంతో ఒంటరి అయిన బ్రజ్‌రాజ్ ఒక్కోటి అమ్మేస్తూ గ్రామ సేవకు ఖర్చు చేసేవాడు. అందుకే ఊరి వారు ఆయన్ను తండ్రిలా భావిస్తారు. ప్రతి కష్టం ఆయనకు చెప్పుకునేవారు. రాయ్‌పూర్‌లోని రాజ్‌కుమార్ కాలేజీ పూర్వ విద్యార్థి అయిన ఆయన ఆ కళాశాల వర్కింగ్ కమిటీ శాశ్వత సభ్యుడు కూడా. అందుకుగాను అందే 50 వేల రూపాయల గౌరవ భృతిని కూడా ప్రజల కోసం పంచేసేవాడు. తన దగ్గర ఉన్న విలువైన వస్తువులన్నీ అమ్మేయడంతో పేదవాడు అయిపోయాడు. 1987లో పురానా తిగిరియాలోని ఓ కొండపై చిన్న పూరి గుడిసె వేసుకుని మకాం మార్చాడు. ఆయన కొండ దిగి వచ్చిన ప్రతిసారి గ్రామస్తులు చాలా గౌరవంగా చూసుకునేవారు. పండుగలు, పబ్బాలు ఏమున్నా ఆయన చేతి ద్వారానే కార్యక్రమాలు జరిగేవి. వృద్ధాప్యంలో పడి పస్తులుండాల్సిన పరిస్థితి ఎదురయ్యే సరికి గ్రామస్తులే అన్నీ తామై సేవలు చేశారు. గ్రామంలో ఏవైనా వివాదాలొస్తే కొండ మీదకే పరిగెత్తేవారు. ఆయన విధించే పెద్ద శిక్ష ఏమిటంటే తప్పుగా ప్రవర్తించిన వ్యక్తితో ఇక ఆయన మాట్లాడడు. విన్నవారికే ఇదేం శిక్ష అనిపించినా అనుభవించే వాడికి మాత్రం అదో పెద్ద సమస్య. అంత ప్రేమిస్తారు బ్రజ్‌రాజ్‌ను. అంత ప్రజాదరణ ఉంది కనుకే ఆయన్ను ఎన్నికల్లో పాల్గొనాల్సిందిగా ఒకప్పటి ఒడిశా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ కోరాడు. తాను తిరస్కరించడంతో ఆయన భార్యతో పోటీ చేయించాడు. ఆమె మంచి మెజారిటీతో గెలుపొందింది కూడా.

రాజ వైభవాన్ని అనుభవించిన ఓ వ్యక్తి కటిక బీదరికాన్ని చవిచూస్తూ కూడా రాజసాన్ని ప్రదర్శించగలగడం ఒక్క బ్రజ్‌రాజ్‌కే చెల్లింది! ఈ రాజరికాలు, సంస్థానాల గొడవ మర్చిపోయిన తరంలో, 95 ఏళ్ల వయసపుడు అదే పూరి గుడిసెలో ఆయన మరణిస్తే వందలాదిగా ప్రజలు ఏకమై కడయాత్ర సాగించారు. అశ్రునయనాలతో 'ఆజా.. ఆజా..' అంటూ ఆయన్ను తలచుకున్నారు. మకుటంలేని మహారాజు అంటే అర్థం ఇదేనేమో.

మంటల మధ్యే మనుగడ

నూరేళ్లగా రావణకాష్టంలా రగులుతూనే వుంది ఝరియ. జార్ఖండ్ రాజధాని నగరం రాంచీకి 270 కిమీ దూరంలో వున్న ఈ ప్రాంతం భారీ బొగ్గు గనులకు ప్రసిద్ధి చెందినది. ఇక్కడ ఓ వైపు బొగ్గు తవ్వకాలు జరుగుతూ వుంటాయి. మరోవైపు నేల నెర్రుల్లోంచి వెలువడే సహజవాయువులు మండుతుంటాయి. పగలు రాత్రి తేడా లేకుండా పొగల మబ్బులు కమ్మి ... ఊపిరాడనివ్వవు. కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి వాయువులు ప్రమాదకర పరిమాణంలో విడుదలౌతుంటాయి. ఈ మంటల మధ్యనే చిన్నారులు గాలి పటాలు ఎగురేస్తూ, దాగుడు మూతలు ఆడుకుంటూ వుంటారు. నట్టింట్లో మంటలు రేగుతుంటే తిట్టుకుంటూ మరో ఇల్లు కట్టుకోవడం మినహా వారికి మరో మార్గం లేదు. ఒక్కోసారి భారీ గోతులు ఏర్పడి కుటుంబాలకు కుటుంబాలు ఆ మంటల్లో పడి అదృశ్యమౌతుంటాయి. ఇలా ఎందరు జనాభా లెక్కల నుంచి శాశ్వతంగా సెలవు తీసుకున్నారో ఎవరికీ తెలీదు. పోషకాహార లోపం, విష వాయువుల మధ్య నివాసం వల్ల చర్మ, శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడని వారు అరుదు. రోజుకి పదేసి గంటల పాటు దుర్భర పరిస్థితుల మధ్య పని చేస్తూ అనామకంగా రాలిపోతుంటారు. ◆



షూ...ఫోటో షూట్

నేచర్ ఫొటోగ్రాఫర్ల విన్యాసాలు, పరిస్థితులు వన్య ప్రాణులకు చాలా దగ్గరగా ఉంటాయి. చిత్రించాలనుకున్న ఆ బుజ్జి ప్రాణులు చిత్రంగా వారి మీదెక్కి తచ్చాడుతాయి. లైవ్లీ షాట్ కోసం ప్రయత్నిస్తే సెల్ఫీ ఫోజులోకొస్తాయి. ఉప్పెక్కుతాయి. ముద్దాడతాయి. మురిపాలు పోతాయి. మూతి ముడుచుకుని కెమెరా మీద నించుటాయి. పెద్దవేమో గాబరా పెట్టించేలా ముఖంలో ముఖం పెట్టి పరిశీలిస్తాయి. షాట్ ఎలా వచ్చిందా అన్నట్టుగా పరికిస్తాయి.అదే వారి వృత్తికి, అభిరుచికి ప్రత్యేకత. గంటల తరబడి, అవసరమైతే రోజుల తరబడి అలాగే పోస్ట్‌కు అతుక్కుపోయేవారికి కొన్ని ఊపిరి సలపని క్షణాలొస్తాయి. రెప్ప కదపని సమయాలు వస్తాయి. అలా క్యాప్చర్ చేసిన మొమంట్సే మీకోసం. ◆